పక్షం

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 2

నవంబర్ 16-30, 2003

సమతా పబ్లికేషన్స్ ప్రచురణ

పేజీలు : 24

వెల: రూ.5-00

లోపలి పేజీల్లో...

వార్షిక చందా రూ॥120/-లు

సంపాదకీయం:

అభివృద్ధి - రాజకీయం, సంబంధం లేని అంశాలా?

ఆపద్ధర్మ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి హఠాత్తుగా జ్ఞానోదయం అయింది. ఇన్నాళ్లు అభివృద్ధి-రాజకీయాలు వేరువేరు అని, ప్రతిపక్షాలు అనవసరం అయినచోట రాజకీయాలు చేస్తున్నాయని వాదిస్తూ వచ్చిన ఆయన ఇప్పుడు అన్ని చోట్లా రాజకీయాలే మాట్లాడుతున్నారు. స్పష్టంగా అభివృద్ధి కార్యక్రమాలుగా కనబడే చోట్లకూడా ఆయన ఉపన్యాసాలు, చేతలు రాజకీయ ప్రాధాన్యతనే సంతరించుకుంటున్నాయి. సమాజ జీవితంలో రాజకీయాలు అతిప్రధానమైన అంతర్భాగమని అవి ప్రత్యక్షంగానో పరోక్షంగానో లేనిచోటు లేదని, అన్నిచోట్ల రాజకీయాలతో, రాజకీయ అవగాహనతో వ్యవహరించవలసిందేనని ఇన్నాళ్లకైనా ఆయన గుర్తించినందుకు సంతోషం.

ఇటీవలి రాజకీయ-అభివృద్ధి పరిణామాలు రెండింటి గురించి ముఖ్యంగా చర్చించవలసి ఉంది. అవి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజకీయస్థితికి, అభివృద్ధి స్థితికి తార్కాణాలుగా నిలుస్తాయి. లోతుగా విశ్లేషిస్తే పైకి కనబడని ఎన్నో అంతర్గత చలనాలను ప్రకటిస్తాయి.

మొదటిది చదువుల పండుగ. చదువుల కోసం ఒక పండుగ నిర్వహించడం, బాల కార్మికులను మళ్లీ విద్యలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించడం చాలా ఆహ్వానించదగిన పరిణామాలే. కాని పిల్లలు చదువుకు ఎందుకు దూరమవుతున్నారో అసలు కారణమైన పేదరికాన్ని విస్మరింపచేసి అందుకు తల్లిదండ్రులను బాధ్యులను చేయడానికి ప్రయత్నించడం నిజమైన రాజకీయం. ఈ రాజకీయానికి తోడుగా చదువుల పండుగ సభల్లో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి చదువు అవసరం, ప్రాధాన్యత గురించి మాట్లాడే బదులు "నక్సలైట్ల దురాగతాల గురించి ప్రతిపక్షాల బాధ్యతారాహిత్యం" గురించి మాట్లాడారు. అంటే విద్య అనే అభివృద్ధి కార్యకలాపం గురించి మాట్లాడేటప్పుడు రాజకీయాల గురించి మాట్లాడక తప్పదని చంద్రబాబు గుర్తించాడన్నమాట. ఇవి ఒక రాజకీయాలైతే, ఒక ముక్కుపచ్చలారని పిల్లవాడు ఒక చదువుల పండుగ సభలో మరొక రాజకీయాలను ప్రకటించాడు. తన తండ్రి తాగి పడుకుంటాడనీ, అందువల్ల తనను చదువుకు పంపడం లేదనే వాస్తవంతో ప్రారంభించిన ఆ పిల్లవాడి జవాబులు క్రమంగా విమర్శనాత్మక విశ్లేషణలోకి వెళ్లి చంద్రబాబు రాజకీయ బండారాన్ని బైటపెట్టాయి. ఆ పిల్లవాడి తండ్రి వారానికి ఒకసారి ఆదివారం మాత్రం తాగేవాడు. కాని ఊరికి ముఖ్యమంత్రి వస్తున్న ఆనందంలో పార్టీవారు పంచిన సారా ఆ మంగళవారం నాడు కూడా తాగి పడిపోయాడు. మద్యనిషేధాన్ని ఎత్తివేసి మళ్లీ సారా ప్రవహింపచేసిన నారావారికి తాను ముందుకు తీసుకువచ్చిన అభివృద్ధి ఎంతదూరం వచ్చిందో ఈ సంఘటనలో అర్థమై ఉండాలి.

అభివృద్ధిపేరున ప్రజల్ని మభ్యపెట్టే రాజకీయాలకు కష్టాలలో నుంచి ప్రజలు నేర్చుకునే రాజకీయాలకు మరొక నిదర్శనం రేషన్ కార్డుల పంపిణీల బాగోతం. ప్రపంచబ్యాంకు ఆదేశాలమేరకు ప్రజాపంపిణీ విధానాన్ని పరిశీలించి పేదల రేషన్‌కార్డుల సంఖ్యను తగ్గించిన చంద్రబాబు నాయుడుగారికి ముందస్తు ఎన్నికలతో పాటే రేషన్‌కార్డులు మళ్లీ గుర్తొచ్చాయి. మూడు సంవత్సరాలుగా గోదాముల్లో పడి చిరిగిపోతున్న రేషన్‌కార్డులను బయటికి తీసి తేదీలు నిర్ణయించి కార్డుల పంపిణీ మొదలుపెట్టారు. తప్పులతడకగా సాగిన వెలుగుసర్వేల మీద ఆధారపడి ఎవరికి ఏ రంగు కార్డులివ్వాలో నిర్ణయించారు. ఈ నిర్ణయం మీద స్థానిక తెలుగుదేశం నాయకుల ఆశ్రితుల ప్రయోజనాలు ఓట్ల ప్రయోజనాలు ప్రభావం చేస్తున్నాయన్నది సర్వవిదితం. అందువల్లనే ప్రతిరోజు రాష్ట్రంలో ఎక్కడో ఓ చోట రేషన్‌కార్డుల పంపిణీ విధానానికి ఘర్షణలకు దారితీస్తుంది. హైటెక్ హైదరాబాద్ నడిబొడ్డున ఒక తెలుగుదేశం చోటానాయకుడికి 174 కార్డులున్నాయని అర్హులైన వేలాదిమంది పేదలకు కార్డులు లేవని బయటపడింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో కార్డుల పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించిన మహిళలను మంత్రి విజయరామారావు స్వయంగా దూషించడం టెలివిజన్ తెరకెక్కింది. అదే నియోజకవర్గంలో మరోచోట కార్డుల పంపిణీ అక్రమాల్ని ప్రశ్నించిన కాంగ్రెస్ కార్పొరేటర్‌పై తెలుగుదేశం నాయకులు చేయిచేసుకున్నారు.

ఇవన్నీ ఎవరి అభివృద్ధిని సూచిస్తున్నాయి? ఏ రాజకీయాలను ప్రస్తావిస్తున్నాయి? రాజకీయ రహితమైన అభివృద్ధి అనేది అంతిమంగా అధికారంలో ఉన్న వారి అభివృద్ధేనని అభివృద్ధిని రాజకీయాల నుంచి వేరుచేసి మాట్లాడ్డం ఒక ఉద్దేశపూర్వక వక్రీకరణ అని ఎందరెందరో రాజకీయార్థిక శాస్త్రవేత్తలు చేసిన విశ్లేషణకు ఇవాళ ఆంధ్రప్రదేశ్ మరొక రుజువు చూపిస్తుంది.

భారత దేశంలో మౌలిక సౌకర్యాలు - కొన్ని విదేశాలతో పోలికలు

	ఇండియా	చైనా	ఇండోనేషియా	మలేసియా	ఫిలిప్పైన్స్	థాయ్‌లాండ్	పాకిస్తాన్	శ్రీలంక
తలసరి విద్యుత్ వాడకం (యూనిట్లు)	359	717	319	2378	436	1349	332	232
విద్యుత్ రవాణా పంపకం నష్టాలు (మొత్తం ఉత్పత్తిలో శాతం)	30	7	12	8	17	9	25	18
తారు, సిమెంటు రహదారులు (మొత్తం, రహదారుల నిడివిలో శాతం)	20	22	46	75	19	98	44	81
రైల్వేలలో సరుకు రవాణా (కి.మీ.కు బిలియన్ టన్నులు - మిలియన్ జి.డి.పి.లో శాతం)	141	306	8	7	0	8	19	2
టెలిఫోన్ మెయిన్‌లైన్లు (ప్రతి వెయ్యి మందికి)	23	73	27	195	33	84	21	27
ప్రతి వెయ్యిమందికి మొబైల్ ఫోన్లు	2	27	8	125	36	38	2	11
మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు (అవి అందుబాటులో వున్న ప్రజల శాతం)	31	38	66	-	83	96	61	83
తలసరి జి.డి.పి	430	762	822	3997	1050	2310	469	815
తలసరి జి.డి.పి. వార్షిక పెరుగుదల శాతం	4	7	-1	2	2	0	1	4

పై గణాంకాలు 1996-00 సంవత్సరాల సగటు : మూలం : వరల్డ్ డెవలప్‌మెంట్ ఇండికేటర్స్ 2002 భారతదేశం గణాంకాలు 02-03 ఎకనమిక్ సర్వే

మౌలిక సౌకర్యాలకు నిధులు : లక్ష్యం, సాధన

(శాతం)

	మౌలిక సౌకర్యాలకు ఖర్చు		ప్రభుత్వరంగం పెట్టుబడులు		ప్రయివేటు రంగం పెట్టుబడులు	
	లక్ష్యం	సాధన	లక్ష్యం	సాధన	లక్ష్యం	సాధన
1995-96	5.5	5.1	4.4	3.3	1.1	1.7
1996-97	5.8	4.9	4.4	1.3	1.9	1.9
1997-98	6.1	4.2	4.4	2.9	1.7	1.3
1998-99	6.4	4.3	4.4	2.9	2.0	1.4
1999-00	6.7	4.2	4.5	2.8	2.1	1.4
2000-01	7.0	4.6				
2001-02	7.2	3.8				

మూలం : మౌలిక సౌకర్యాల వ్యాపారీకరణ - నిపుణుల కమిటీ 1996

అభివృద్ధే శ్రీరామరక్ష అయినపుడు భద్రతా ఏర్పాట్లెందుకు?

రాష్ట్రపతి, గవర్నరు, ముఖ్యమంత్రి తిరుపతి రాక సందర్భంగా "కనీవినీ ఎరుగని" భద్రతాఏర్పాట్లు, గుంటూరులో తెలుగుదేశం పార్టీ సభకు ముఖ్యమంత్రి రాక సందర్భంగా "కనివినీ ఎరుగని భద్రతాఏర్పాట్లు", కొన్ని వారాల క్రితం ముఖ్యమంత్రి తిరుపతిదేవుని దర్శనానికి వెళ్లినప్పుడు 3000 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు, గుంటూరులో జరిగిన పార్టీ సమావేశం, ఆ సమావేశానికి ముఖ్యమంత్రి రాకపోకలు, భద్రతా ఖర్చులు అన్నీ తెలుగుదేశం పార్టీ భరిస్తుందా? ఇంత భద్రతా ఏర్పాట్లకు ఖజానా మీదనేకదా భారం పడేది? అలాంటప్పుడు ఇది కూడా ఆ పార్టీయే ఎందుకు భరించకూడదు. ఆ పార్టీ ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి వెళ్లారు. ఇక ముందు కూడా వెళ్లబోతున్నారు. ముఖ్యమంత్రే కావాలంటే ఇంత ఖర్చు అవుతుందని పిలిచినవారికి చెప్పి, ఆ ఖర్చు అంతా భరిస్తేనే ముఖ్యమంత్రి రాగలరని ప్రభుత్వం స్పష్టం చేయాలి. ఈ ఖర్చును ప్రభుత్వం భరించాల్సిన పనిలేదు. అలాగే కొంతమంది శాసనసభ్యులు కూడా తమకు ప్రాణభయం వుందని సెక్యూరిటీ రక్షణ కోరుతున్నారు. వారికి ప్రాణభయం ఏర్పడటంలో తప్పు పని ఏం చేశారో మనకు తెలియదు. అది ఫ్యాక్షనలిజం వల్ల కావచ్చు, గ్రామకక్షల వల్ల కావచ్చు. వీటన్నిటి నుంచి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదెలా అవుతుంది?

ఇంకో విషయం కూడా వుంది. ప్రభుత్వం అమలుపరుస్తున్న కార్యక్రమాలతో ప్రజలు సుఖపడిపోతున్నారని, ఆ అభివృద్ధే శ్రీరామరక్ష అని, అదే తమకు నోట్లు సంపాదించి పెడుతుందని పాలకులు చెప్పుకొంటుంటారు. ప్రజలు అంత సంతృప్తితో వుంటే నాయకులకు అంతకన్నా వేరే రక్షణ అవసరం లేదు. ఈ విషయాన్నే మంత్రి కోడెల చెప్పారు. అయినా ఇంత "కనీ విని ఎరుగని" రక్షణ కావాల్సి వచ్చిందంటే సాధించిన అభివృద్ధి అబద్ధం అయి వుండాలి.

★ ★ ★

పరిశ్రమల ప్రతిపాదనల లెక్కలు చూపించి పరిశ్రమలే వచ్చేసినట్లు, అవి పని చేయటం ప్రారంభించినట్లు చిత్రిస్తున్న ముఖ్యమంత్రి పడేపాట్లు చూస్తుంటే జాలివేస్తుంది. ఎందుచేతనంటే వస్తున్న ప్రతిపాదనలు తయారీరంగం (మాన్యుఫాక్చరింగ్)లోకి బొట్లుబొట్లుగానే వస్తున్నాయి. 'ప్రాజెక్ట్స్ ఇండియా' సంస్థ విశ్లేషణ ప్రకారం నూరు రూపాయల పెట్టుబడుల ప్రతిపాదనలు వస్తున్నాయనుకొంటే అందులో తయారీ రంగంలోకి వచ్చే పెట్టుబడులు కేవలం 22రూపాయలు మాత్రమే. మన రాష్ట్రంలోకి వస్తున్న పెట్టుబడి ప్రతిపాదనల్లో 30శాతం మాత్రమే ఉత్పత్తి ప్రారంభించాయనే ప్రభుత్వ ప్రకటన నిజమే అనుకున్నా, ఆ 30 శాతంలో 22 శాతం తయారి రంగంలోకి వస్తున్నాయనుకొంటే, అదెంత పారిశ్రామీకీకరణో సులువుగా అర్థం చేసుకోవచ్చు. ఈ సర్వే మూడు ముఖ్య ధోరణులను ఎత్తి చూపింది. ప్రతిపాదనల్లో 64 శాతం ప్రభుత్వరంగం నుంచే రాగా, ప్రయివేటు రంగం నుంచి 24 శాతం ప్రతిపదనలే వచ్చాయి. ప్రయివేటు రంగం ఏదో తవ్వి తలకెత్తుతుందన్న వారు గ్రహించాల్సిన విషయం ఇది. బహుశా ప్రయివేటు రంగం ప్రభుత్వరంగ పరిశ్రమలదే గుటకాయస్వాహా కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ, కొత్త పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టడానికి ముందుకు రావటం లేదని కూడా అనుకోవచ్చు. ఇది మొదటి విషయం. మహారాష్ట్రలోనే ఎక్కువ ప్రతిపాదనలు రావటమే కాకుండా, వచ్చిన ప్రతిపాదనల్లో సగం మేరకు ఉత్పత్తి స్థాయికి చేరుకోవటం గమనించాల్సిన రెండో విషయం. మన రాష్ట్రంలో ఇది 30 శాతమే. వచ్చే పెట్టుబడులన్నీ పరిశ్రమలు స్థాపించడానికి రావటం లేదు. ఈ సంవత్సరపు పూర్వార్థ కాలంలో ఆమోదించిన పెట్టుబడుల్లో 60 శాతం సేవల రంగంలోకే వచ్చాయి. ఎక్కువ పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చే మొదటి అయిదు రాష్ట్రాల్లో మొట్టమొదట మహారాష్ట్ర వుంటే గుజరాత్, తమిళనాడు, కర్నాటక తర్వాత అయిదో స్థానంలో ఆంధ్రప్రదేశ్ వుంది. ఇదీ మన రాష్ట్రం సాధించిందని చెప్పుకొంటున్న అభివృద్ధి. అభివృద్ధిని అడ్డుకొంటుంది నక్సలైట్లా, కాంగ్రెసా లేక చంద్రబాబా?

★ ★ ★

గత నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్‌లో ప్రభుత్వ పథకాలు ఎలా, ఎంతమేరకు అమలు జరుగుతున్నాయని తెలుసుకోవడానికి నాలుగు జిల్లాల అధికారుల సమావేశం జరిగింది. ఈ పథకాలకు బ్యాంకులు ఇవ్వాల్సిన సహాయం ఇవ్వటం లేదని, వారి మీద చర్య తీసుకోవాల్సి వచ్చిందని రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారి హెచ్చరించగా, ఇప్పటికే ఇచ్చిన రుణం తిరిగి చెల్లించని వారికి మళ్లీ రుణం ఎలా ఇచ్చేది? అని బాంకు అధికారులు ప్రశ్నించారు. బాంకర్ల వాదన సబబుగానే వున్నట్లనిపిస్తుంది. కాని బాంకింగ్ వ్యవస్థను మొత్తంగా చూస్తే మొండి బకాయిలున్న కార్పొరేట్ సంస్థలకు బాంకులు రుణాలివ్వటం లేదా అని ప్రశ్నించాల్సి వస్తుంది. బాంకుల వద్ద నిధులు మూలుగుతున్నాయి. అవేమి చేయాలో తోచక గృహ నిర్మాణానికి, కార్ల కొనుగోలుకు, విలాస వస్తువులు కొనుక్కోవడానికి, విదేశాలకు వెళ్ళి పై చదువులు చదువుకోవడానికి ఎడమ చేత్తే కుడిచేత్తో రుణాలిస్తున్నారు. వచ్చి తీసుకోండహో అని పత్రికల నిండా ప్రతీరోజూ ప్రకటనలు చేస్తున్నారు. ఇపుడు తాజా వార్త ప్రకారం స్త్రీల బంగారు ఆభరణాలకు కూడా రుణాలిస్తున్నారు. భారతదేశంలో 45 శాతం బంగారం అమ్మకాలు దక్షిణాదినే జరుగుతాయి. ఎక్కువగా దక్షిణాది బాంకులు (మన రాష్ట్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్) ఇలాంటి రుణాలివ్వడానికి ఆసక్తి చూపుతున్నాయి. కొన్ని కోట్ల రూపాయల రుణాలు వసులు కావని నిర్ధయించుకొని ఆ రుణాలు రైటాఫ్ చేస్తున్నాయి. కాని రైతుల విషయం వచ్చేసరికి ఎక్కడా లేని రూల్స్ ఉదహరించి, రుణం ఇవ్వబోమంటున్నాయి. ఇది ద్వందనీతి కాదా?

– విహారి

దేశం పాలనలో వైఫల్యాలే విజయాలు

- వి.హనుమంతరావు

ప్రజల ఆరోగ్యం, విద్య కోసం కేటాయింపులు పెంచారట. ఆర్థికస్థితి మెరుగుపరచడానికి అనేక చర్యలు తీసుకొన్నారట. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించటంలో లేదా మూసేయటంలో అన్ని రాష్ట్రాల కన్నా ఆంధ్రప్రదేశ్ ముందున్నదట. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే స్థూల రాష్ట్రాదాయ విషయంలో కొన్ని ఇతర రాష్ట్రాల కంటే ముందున్నదట. అంతెందుకు ఆంధ్రప్రదేశ్‌లో పాలు, తేనె ప్రవహిస్తున్నదనే భావనను ప్రజల్లో కలిగించడానికి ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ఒక ప్రకటనలో సొంత డబ్బా కొట్టుకున్నాడు. పత్రికల వాళ్లను పిలిస్తే అడ్డదిడ్డ ప్రశ్నలు వేస్తారేమోనని ఒక ప్రకటనను పత్రికా కార్యాలయాలకు పంపించారు. ఆ ప్రకటన పూర్తి పాఠం చదివితే ఆయన ఓ అంకెల గారడిని ప్రదర్శించారని చెప్పకనే చెబుతుంది. స్థూల రాష్ట్రాదాయం ఒకచోట, నికర రాష్ట్రాదాయాన్ని మరొకచోట ఉపయోగించారు. కొన్నిచోట్ల కాంగ్రెస్ పాలించిన సంవత్సరాలను కలిపి లెక్కలిచ్చారు. మరోచోట 1995-96 నుండి గణాంకాలు వాడారు. 1980-81 పునాదిగా ఉన్న గణాంకాలను 1994 పునాదిగా వున్న గణాంకాలతో పోల్చారు. ఏ రంగాల్లోనైతే ప్రభుత్వం వైఫల్యాలను ఎదుర్కొందో, ఆ రంగాల గురించి ఒక్కమాట కూడా లేదు. మొత్తంమీద సుపరిపాలన సవ్యంగా సాగుతుందనే అభిప్రాయాన్ని కలిగించడానికి ప్రయత్నించారు. కాని నల్లపిల్లిని ఎంత తోమినా తెల్లపిల్లి కాదుకదా, అలాగే వైఫల్యాలను విజయాలుగా చూపించడానికి ప్రయత్నిస్తే ఎక్కడో దొరికిపోతారు.

ఆర్థికమంత్రి కాబట్టి సహజంగానే స్థూల రాష్ట్రాదాయం, రెవెన్యూ ఆదాయం, రుణాలు, ద్రవ్యలోటు లాంటి విషయాల గురించి ప్రస్తావించారు.

స్థూల రాష్ట్రాదాయం

ఆయన ప్రకారం స్థూల రాష్ట్రాదాయం పెరుగుదల రేటు పెరిగింది. పెరుగుదల చూపించటం కోసం అంకెల గారడీకి దిగారు. ఏ సంవత్సరాల మధ్యకాలంలో పెరుగుదల చూపి అంతా బాగానే వుందని చెప్పడానికి వీలుంటుందో, ఆ సంవత్సరాలను ఎంచుకొన్నారు. తెలుగుదేశం పరిపాలిస్తున్న కాలం తీసుకొని, పోలికలు చూపిస్తే అదొక పద్ధతి. లేదా, ఒక దశాబ్దాన్ని, మరో దశాబ్దంతో పోలిస్తే అది మరో పద్ధతి. ఈ రెండు పద్ధతులను పక్కనపెట్టి (ఒక్క 1980-81 సంవత్సరంలో ఎంత అభివృద్ధి రేటు వుందో, దానిని 93-94/2000-01 మధ్యకాలం అంతటిలో అభివృద్ధి రేటుతో పోల్చి 4.43శాతం నుంచి 5.80శాతం పెరిగిందని చూపించారు. ఇదేం పోలిక? ఈ పోలికకు తలాతోక లేదు. కాని ఎలా వుండి వుండాలి? ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త సి.హెచ్.హనుమంతరావు, సెస్ సంస్థ డైరెక్టర్ మహేంద్రదేవ్ 80వ దశకంలో పెరుగుదలను 90వ దశకంతో పోల్చారు. దీని ప్రకారం, మొదటి దశకంలో దేశం మొత్తంలోలాగే ఆంధ్రలో కూడా 5శాతానికి కొంచెం ఎక్కువగా వుండగా, 90వ దశకంలో అఖిల భారత పెరుదుదల రేటుకన్నా రాష్ట్రంలో ఈ పెరుగుదల జరిగిందనడానికి స్పష్టతలేదు. అలాగే మహేంద్రదేవ్, సి.రవి కలిసిన చేసి అధ్యయనం 80-81/90-91లో పెరుగుదలను 93-94/2000-01 పెరుగుదలతో పోల్చడం జరిగింది. (93-94ను ఎంచుకోవడానికి కారణం అప్పటినుంచి బేస్ ఇయర్ మారింది కాబట్టి). దీని ప్రకారం మొదటికాలంలో పెరుగుదల 5.5శాతం అయితే, రెండవ కాలంలో 5.31శాతానికి తగ్గింది. అంటే పెద్దగా మార్పు ఏమీలేదన్న మాట. ఇతర రాష్ట్రాలతో స్థూల రాష్ట్రాదాయ పెరుగుదల రేటును పోలిస్తే 80వ దశకంలో ఆంధ్రప్రదేశ్ కన్నా కేవలం మూడు రాష్ట్రాలే ఎక్కువ పెరుగుదల రేటును చూపించగా 93-94/99-00లలో మన రాష్ట్రం ఎనిమిదో స్థానానికి దిగజారింది(మహేంద్రదేవ్, రవి). దక్కన్ క్రానికల్ ఒకటవ తేదీ సంపాదకీయంలో 80-91కాలాన్ని, 93-01మధ్యకాలంతో పోల్చి ఈ పెరుగుదల రేటు 5.50శాతం నుంచి 5.31శాతానికి తగ్గిందని వ్యాఖ్యానించింది. ఇదీ, మహేంద్రదేవ్, రవి పోలికలు ఒకటిగానే వున్నాయి.

93-01మధ్య కాలంలో కర్నాటక, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో పెరుగుదల రేటు మనకన్నా ఎక్కువగా వుందని ఈ సంపాదకీయం వ్యాఖ్యానించింది. ఆర్థికమంత్రి అంకెలతో మసిపూసి మారేడు కాయ చేయడానికి ఎలా ప్రయత్నించారో

చెప్పడానికే ఈ విశ్లేషణ చేయాల్సివచ్చింది.

ఆర్థికమంత్రి తన ప్రకటనలో స్థూల రాష్ట్రాదాయంలో సేవలరంగం వాటా పెరిగిందని చూపించారు. ఇది దేశం మొత్తంగా చూచినా, ఈ రంగం వాటాశాతం పెరిగిందన్న మాట వాస్తవమే. స్థూల రాష్ట్రాదాయంలో సేవలరంగం వాటా పెరిగిందని చెప్పిన ఆర్థికమంత్రి ఆ రంగాని కన్నా అతిముఖ్యమైన, ప్రాథమికమైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాల వాటా ఎంత పెరిగిందో ఎందుకో చెప్పలేదు? అలా చెప్పకపోవటం వెనుకనున్న బహిరంగ రహస్యం ఏమంటే వ్యవసాయం వాటా పడిపోయింది. పారిశ్రామిక రంగంలో పెరుగుదల స్థంభించింది. ఆర్థిక వ్యవస్థ మూలస్థంభాలైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు ఇలా ఒకపక్క కొడిగడుతుంటే, మరోపక్క అంతా పెరుగుతోంది, అభివృద్ధి జరిగిపోతుందని చెప్పే బధిరాంధ్ర ప్రభుత్వానికి ఎంత త్వరగా గేట్ చూపిస్తే అంత మంచిది.

రెవెన్యూ ఆదాయం పెరుగుదల, అలాగే స్థూల రాష్ట్రాదాయం రెవెన్యూ ఆదాయం రేషియో పెరిగిందని ఆర్థికమంత్రి చెప్పిన విషయం కాదనలేం. కాని ఎలా పెరిగిందని వివరాల్లోకి పోతే, నీటిపారుదల, విద్యుత్‌ఛార్జీలు, బస్సుఛార్జీలు పెంచటం వల్ల, మద్యనిషేధాన్ని తొలగించి ప్రజల చేత ఇంకా ఇంకా తాగించి ఎక్సైజు ఆదాయాన్ని పెంచటం వల్ల, యూజర్ ఛార్జీలు ప్రవేశపెట్టి వసూళ్లు ప్రారంభించటం వల్ల పెరిగింది. కాని ఆర్థికవ్యవస్థను చక్కగా మానేజ్ చేయటం వల్ల కాదని, అందుచేత ఆర్థికమంత్రికి ఈ విషయంలో గుడ్ కండక్ట్ సర్టిఫికేట్ ఏమీ ఇవ్వనవసరం లేదని చెప్పవచ్చు.

ప్రణాళికేతర ఖర్చు 00-01 కు 02-03కు మధ్య తగ్గిందని మరో ప్రకటన. అదేమిటి ఈ పోలిక? ఈ రెండు సంవత్సరాల కాలంకు మాత్రమే పరిమితం చేశారు? సంస్కరణలకు ముందు దశాబ్దానికి, తర్వాత దశాబ్దానికి పోల్చిఉండవచ్చు లేదా ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితిని అంతకు ముందు కాంగ్రెస్ పాలించిన కాలంతో పోల్చవచ్చు. కాని రెండు సంవత్సరాలకే పోలికను పరిమితం చేసారంటే అది ఘోర వైఫల్యాన్ని అఖండవిజయంగా చిత్రించే ప్రయత్నంలో భాగమే. 95-96లో చంద్రబాబు చక్రవర్తి అయ్యేనాటికి మొత్తం ఖర్చులో ప్రణాళికేతర ఖర్చుశాతం కేవలం 35.30శాతంకాగా 98-99లో 74.66 శాతానికి పెరిగిపోయింది.(బడ్జెట్-ఇన్-బ్రీఫ్ గణాంకాలు). ఇప్పుడు ఆర్థికమంత్రి చెప్పిన దాని ప్రకారమే 02-03లో 74.3శాతం వుంది. అంటే శాతం రెట్టింపయింది. అయినా, అంతా బాగానే వుందని చిత్రించటంలో ఎంత తెంపరితనం!

పట్టుకొచ్చిన రుణాన్ని రానురాను ఆస్తుల సృష్టికి, మౌలిక సౌకర్యాల కల్పనకు ఖర్చు పెట్టారని చెప్పటం ప్రజల కళ్లు కప్పడానికి చెప్పిన మరో పచ్చి అబద్ధం. ఎందుచేతనంటే ఆంధ్రప్రదేశ్‌లో బడ్జెట్ పత్రాలు, ఆర్థిక సర్వే ప్రకారం “90-91లో చేసిన పబ్లిక్ రుణంలో 20శాతం రుణాన్ని తిరిగి చెల్లించడానికే ఖర్చుచేయగా 99-00నాటికి ఈశాతం 64కు పెరిగింది. (ఎన్.శ్రీదేవి, “ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ సెస్ ప్రచురణ”). ఇలా చెల్లించటం ఆస్తుల సృష్టా? మౌలిక సౌకర్యాలకు చేసిన ఖర్చా?

నికర రాష్ట్రాదాయంలో (ప్రకటనలో అన్ని సందర్భాల్లో స్థూల రాష్ట్రాదాయాన్ని పేర్కొంటూ, ఈ విషయంలో నికర రాష్ట్రాదాయాన్ని పేర్కొనటంలో దీని భావమేమి తిరుమలేశా) రుణంశాతం, వడ్డీ శాతం మూడు ఇతర రాష్ట్రాల శాతాలకన్నా తక్కువ వుందని, సంతృప్తి వెలిబుచ్చారు. మన రుణ భారం 57వేల కోట్లకు చేరనున్నదని, వచ్చే 3-4 సంవత్సరాల్లో లక్షకోట్లకు చేరుకోవచ్చునని, వడ్డీ చెల్లింపులు మన రెవెన్యూ ఆదాయంలో మూడోవంతుకు పెరిగిందని మనం ఆందోళన పడుతుంటే, వాళ్ల కన్నా తక్కువ వుందని, వీళ్ల కన్నా తక్కువుందని సంతోషించమంటారేమిటి?

ఇతర రాష్ట్రాలతో పోలికలే మీకు ముఖ్యమైతే, నేనూ అందుకు తద్విరుద్ధమైన గణాంకాలివ్వగలను. ఉదాహరణకు 2001-02 (నికరమైన గణాంకాలు ఈ సంవత్సరం వరకే వున్నాయి)లో స్థూల రాష్ట్రాదాయంలో రుణంశాతం మన రాష్ట్రంలో 28.8అయితే, కర్నాటకలో 24.6, హర్యానా 26, తమిళనాడు 23.1, మహారాష్ట్ర 19.7మాత్రమే. అలాగే స్థూల రాష్ట్రాదాయంతో స్థూల ద్రవ్యోల్బణం శాతం లెక్కలు చూస్తే మన రాష్ట్రం 4.48శాతం కాగా, కేరళ 4.29, మహారాష్ట్ర 4.12, తమిళనాడు 3.09శాతం మాత్రమే.

అభివృద్ధి చెందుతున్న దశలో రాష్ట్రాలైనా, దేశాలైనా అనేక సమస్యల నెదుర్కొంటుంటారు. వాస్తవాలను ప్రజల ముందుపెట్టి వారి సహకారాన్ని అర్థించి సమస్యలను పరిష్కరించుకోవచ్చు. అలాగని, ప్రభువులు చిత్తం వచ్చినట్లు ఖర్చుచేసి, లోటు కొనితెచ్చుకుని, మీరు సహాయం చేయండంటే, ప్రజలు పాలకులకు అధికారం లోటు కలిగిస్తారు, మరొకరిని ఎన్నుకుంటారు. ○

మౌలిక సౌకర్యాలను కూడా సమకూర్చలేని వాజమ్మ ప్రభుత్వం

— విహారి

ప్రజలు గత ఎన్నికల్లో బి.జె.పి. ముఖం చూచి ఓటు వేయలేదు; ఓటు చేసిన వారు వాజ్‌పేయి బొమ్మ చూసి ఓటు చేశారు. స్వదేశీ నినాదం చూచి ఓటు వేశారు. ప్రపంచ బ్యాంకుకు, దాని వెనుకనున్న అమెరికా, ఇతర సామ్రాజ్యవాదులకు దాసోహం అనటంలో, మన ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేయడంలో, విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరవటంలో సంస్కరణలను ప్రారంభించిన పి.వి.నరసింహారావు తలతన్నారు. 24 పార్టీల, గ్రూపుల సహాయంతోగాని పరిపాలించలేని ప్రభుత్వం పరిపాలిస్తుందని ఆ పార్టీకి ఓటు వేసిన వారు ఊహించి వుండరు. ఈ కలగూరగంప పార్టీ మూతి విరుపులు, ముక్కు విరుపులు కోపతాపాలు, అలకలు, రాజీనామాలు లాంటి వాటన్నింటినీ సర్దుబాటు చేసుకోవటంలోనే కాలం గడిచిపోయింది. పరిపాలించడానికి సమయమేది ? రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు తగ్గించగలిగిందా? పన్నుల బాకీలు 60 వేల కోట్లు వసూలు చేయగలిగారా ?. రు.120 వేల కోట్ల బ్యాంకు రుణాలను అణాపైసలతో వసూలు చేయగలిగారా? 104 బిలియన్ డాలర్ల మేరకు దేశ రుణ భారాన్ని పెంచింది ఈ ప్రభుత్వమే కదా? రెవెన్యూ ఆదాయంలో సగం వడ్డీ చెల్లింపులు చేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదే. వ్యవసాయినికో విధాన పత్రం వుండాలనే మొక్కుబడి తీర్చింది తప్ప దాని ఆధారంగా స్వల్పకాలిక, మధ్యకాలిక పథకాల రచన జరగనేలేదు. కార్పొరేట్ శక్తులకు అయిదు నక్షత్రాల ఆసుపత్రులను నెలకొల్పుకునే అవకాశాలను కలిగించడంలో చూపుతున్న శ్రద్ధలో వెయ్యవవంతైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పట్ల చూపలేకపోయింది. బి.జె.పి. ప్రభుత్వ ఎజెండాలో లౌకికతత్వ పరిపాలన వెనక్కుపోయి క్రిస్టియన్లను, ముస్లింలను వేధించటం, చంపటం ప్రధాన ఎజెండాగా మారింది. ఢిల్లీలో సిక్కులను ఊచకోత కోసిన తర్వాత ఇంత బరితెగించి దేశాన్ని మతత్వానికి బలి చేసిన ప్రభుత్వం మరొకటి లేదు. ఎంతసేపూ దేశాన్ని మతతత్వ ఊబిలోకి ఎలా దించాలో అనే తపన తప్ప దేశాన్నెదుర్కొంటున్న సమస్యల పరిష్కారం వైపు దృష్టి సారించడానికే సమయం పాలక పార్టీకి లభించడంలేదు!

దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే మౌలిక సౌకర్యాల కల్పన ప్రాథమికమైన, కీలకమైన అవసరం. ఈ విషయం ప్రతీ ప్రణాళికలో పునరుద్ఘాటించటంలోనే కాలం గడిచిపోతోంది; ఆ వైపు పురోగమనం నత్తనడకన సాగుతోంది. విద్యుచ్ఛక్తి, రహదారులు, రైల్వేలు, టెలిఫోన్లు ముఖ్యమైనవి. ఈ రంగాల్లో సాధించినదేమిటో చూద్దాం.

విద్యుచ్ఛక్తి :

విద్యుత్ స్థాపిత ఉత్పత్తి శక్తి 92-93/01-02 మధ్యకాలంలో 301 బిలియన్ యూనిట్ల నుండి 515 బిలియన్ యూనిట్లకు పెరిగినా విద్యుదుత్పత్తి, రవాణా, పంపిణీల విషయంలో అనేక సమస్యలు వెంటాడుతూనే వున్నాయి. 2000 నుంచి జనవరి 2003 మధ్య కాలంలో విద్యుత్‌కోత 8 నుంచి 12 శాతం వరకూ వుంది. ఈ రంగంలో నమ్మకం సడలటంతో పరిశ్రమలు కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రయివేటుగా జనరేటర్లు, వోల్టేజ్ స్టెబిలైజర్లు కొనుక్కోవాల్సి వచ్చింది. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండి వుంటే, ఇన్ని కోట్ల ఖర్చు ఆదా అయి వుండేది. డిమాండు మేరకు విద్యుత్ సరఫరా చేయలేకపోవటం వల్ల దేశంలో 1996-00మధ్య కాలంలో తలసరి విద్యుత్ వినియోగం చాలా తక్కువగా వుంది. అది మన దేశంలో 359యూనిట్లు అయితే పక్కనే వున్న చైనాలో 717, మలేషియాలో 2378, థాయ్‌లాండ్‌లో 1349యూనిట్లు వినియోగం జరుగుతోంది. (వరల్డ్ డెవలప్‌మెంట్ ఇండికేటర్స్ 2002). జల విద్యుదుత్పత్తి శాతం 80వ దశకంలో 38శాతం నుంచి 01-02లో 25శాతానికి పడిపోయింది.

రవాణా పంపిణీ లోపం వల్ల విద్యుత్ నష్టం 97-98లో 25శాతం నుంచి 99-00లో 30శాతానికి పెరిగింది. చైనా, మలేషియా, థాయ్‌లాండ్ లాంటి దేశాల్లో ఈ నష్టాలు పది శాతానికి తక్కువగానే వున్నాయి. విద్యుత్ వినియోగ బిల్లింగ్ 55శాతం కావల్సి ఉండగా వసూలయ్యేది 41శాతం మాత్రమే. 92-93/01-02మధ్య తిరిగి వసూలవుతున్న ఉత్పత్తి ఖర్చు 82శాతం నుంచి 69శాతానికి పడిపోగా, అమ్మకం చేసిన ప్రతి యూనిట్ మీద నష్టం 23 నుంచి 110పైసలకు పెరిగింది. సహజంగానే నష్టాలు పెరుగుతున్నాయి. 2001-02లో సబ్సిడితో కలిపి మొత్తం నష్టం రు.22209కోట్లు! ఇదీ వాజ్‌పేయ్ ప్రభుత్వం ఈ రంగంలో సాధించిన ఘనవిజయం.

రైల్వేలు

దేశంలో 62800కి.మీ. రైల్వే లైన్లున్నాయి. ఇందులో ఎక్కువ భాగం బ్రిటిష్ పాలనాకాలంలో నిర్మించినదే. 1900లో దేశంలోని 85శాతం సరుకులు, 51శాతం ప్రయాణికులను రైల్వేలే చేరవేస్తూ

వచ్చాయి. కాని 2001 నాటికి సరుకు రవాణా 32శాతానికి, ప్రయాణీకుల రవాణా 13శాతానికి పడిపోయింది. ఆ స్థానాన్ని బస్సులు, లారీలు ఆక్రమించాయి. రైల్వేలను ప్రభుత్వం నడుపుతున్న కారణంగా కొన్ని సామాజిక బాధ్యతలను నిర్వర్తించాల్సి వుంది. వినిమయదారుల నిత్యావసర వస్తువుల రవాణాకు ఛార్జీలు తగ్గించటం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ఆర్థికంగా లాభదాయకం కాకపోయినా, ఆ ప్రాంతాల్లో రైల్వేలైన్లు వేయటం, వికలాంగులకు రాయితీల్లాంటి వాటివల్ల ఆ మేరకు సబ్సిడీ రేట్లకు రైల్వేలు బాధ్యతలను నిర్వర్తిస్తూ వస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకే ఈ రాయితీలు ఇస్తున్నా, ఆ నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేయకపోవటంతో రైల్వేలే భరించి, ఆ మేరకు పాసింజర్, గూడ్సు ఛార్జీలు పెంచటం, దీనితో, సరకుల, ప్రయాణికుల రవాణా బస్సులకు, లారీలకు మళ్లింది. రైళ్లు ఆలస్యంగా నడవటం, రైలు ప్రమాదాలు పెరగటం మరోకారణం.

రహదారులు

రహదారుల నిడివి3.2మిలియన్ కి.మీ. వుంది. కాని అందులో సగం మాత్రమే సిమెంట్, తారురోడ్లు, మరో 20శాతం పర్వాలేదనే స్థితిలో వున్నాయి. మొత్తం నిడివిలో జాతీయ రహదారులు కేవలం రెండు శాతం మాత్రమే. అయినా 45శాతం రవాణా ఈ రెండు శాతం రహదారుల మీదే జరుగుతుంది. అలాగే మొత్తం నిడివిలో రాష్ట్ర రహదారుల జిల్లా రహదారుల శాతం 13శాతం మాత్రమే అయినా 40శాతం రవాణాను భరిస్తుంది. 85శాతం రహదారులు గ్రామీణ ప్రాంతాల్లోనే వున్నాయి. ఆ రహదారులు ఎంత సొంపుగా వుంటాయో వేరే చెప్పాల్సిన పనిలేదు. రహదారులు సరిగ్గా లేకపోవటం వల్ల వాహనాల వేగం 30-40కి.మీ.కు మించదు. సగటున లారీలు రోజుకు 200కి.మీ. మించి ప్రయాణం చెయ్యవు. అవే సరిగ్గా వుండి వుంటే రోజుకు 350-400కి.మీ. తిరగగలిగి వుండేవి. ఇందువల్ల ఆలస్యం, ఎక్కువ డీసెల్ ఖర్చు, వాతావరణాలు కాలుష్యం పెరుగుతోంది. మౌలిక సౌకర్యాలు సరిగా లేకపోవటం వల్ల దేశం ప్రతి సంవత్సరం 200బిలియన్ రూపాయలు నష్టపోతుందని నిపుణుల కమిటీ అంచనా.

దేశంలో రహదారులు

(నవంబర్ 01)

	మొత్తం నిడివి	దేశంమొత్తం నిడివిలో శాతం
జాతీయ రహదారులు	58,000	2
రాష్ట్ర రహదారులు	1,24,000	4
ప్రధాన జిల్లా రహదారులు	2,85,000	9
గ్రామీణ రహదారులు	27,33,000	85
	32,00,000	100

జల రహదారుల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడూ పట్టించుకోలేదు. కాని నిజానికి వీటికి ఖర్చు తక్కువ, వాతావరణ కాలుష్య సమస్య ఉత్పన్నమే కాదు. మారుమూల ప్రాంతాలకు రవాణాచేసే సౌకర్యం ఏర్పడుతుంది. ఉరుకులు, పరుగుల జీవనం సాగిస్తున్న ఈ రోజుల్లో వీటి గురించి ఆలోచన లేదు.

టెలికాం

ఎక్కడ చూచినా సెల్‌ఫోన్లు, టెలిఫోన్లు అని మనకు అనిపిస్తుంది. కాని మన స్థానం కొన్ని ఇతర దేశాలతో పోల్చి చూడాలి.

ప్రతీ 100 మందికి టెలీ-డెన్సిటీ

	1995	2001
బ్రెజిల్	8.5	21.8
చైనా	3.3	13.8
భారత్	1.1	3.6
ఇండోనేషియా	1.7	3.7
శ్రీలంక	1.1	4.3
అమెరికా	60.7	66.5
ప్రపంచం	12.3	17.2

దేశంలో ఈ మౌలిక సౌకర్యాల గురించి 11వ ఫైనాన్స్ కమిషన్ రూపొందించిన ఒక సూచిక ప్రకారం ప్రాంతీయ అసమానతలు చాలా లోతుగా వున్నాయి. ఒక పక్క అరుణాచల్‌ప్రదేశ్ సూచిక 70 అయితే, మరో పక్క గోవాలో సూచిక 201. విద్యుత్ వినియోగం, రహదారులు, వాటి నాణ్యత, రైల్వేలైన్లు, టెలిఫోన్లు లాంటి కనీస సౌకర్యాల విషయంలో ఈశాన్య, కేంద్ర, తూర్పు ప్రాంతాల్లో చాలా వెనుకబడి వున్నాయి. 2001-02లో అఖిల భారత స్థాయిలో విద్యుచ్ఛక్తి పిఎల్ఎఫ్ (ఉత్పాదక శక్తి) 70శాతం అయినా, ఒక పక్క దక్షిణాదిలో 82శాతం దాకా వుంటే తూర్పు ప్రాంతంలో 47శాతం, ఈశాన్య భారతంలో కేవలం 18 శాతం మాత్రమే, అలాగే తలసరి విద్యుత్ వినియోగం చూస్తే ఈశాన్యంలో 99యూనిట్లు వుంటే, ఉత్తర భారతంలో 530 యూనిట్లు, దక్షిణాన 563యూనిట్లు వుంది. బి.జె.పి ప్రభుత్వం ఈ అసమానతల తొలగింపు కోసం ఏం చేసింది? గత అయిదు సంవత్సరాలుగా ప్రపంచబ్యాంకు ఆదేశం మేరకు ఉన్న విద్యుత్మండళ్లను భ్రష్టు పట్టించి, అనేక రాష్ట్రాల్లో ప్రతీ మండలిని మూడుముక్కలు చేయటమే ఈ ప్రభుత్వం సాధించిన ఘనకార్యం.

దేశం ప్రగతికి మౌలిక సౌకర్యాల కల్పన మొదటి మెట్టు. ప్రణాళికల్లో వీటి కల్పన అత్యవసరం అని చెబుతూనే వుంటుంది. కాని ఆచరణ తాబేలు నడక నడుస్తుంది. ఉదాహరణకు స్థూల జాతీయాదాయం ఆరు-ఏడో శాతం పెరిగితే, రవాణా సౌకర్యాల పెరుగుదల ఎనిమిది నుంచి తొమ్మిది శాతం పెరగాల్సి వుంది. ఈ రంగంలో రైల్వేలను చూస్తే గూడ్స్ టారిఫ్, టికెట్ ఛార్జీల పెరుగుదల, రైల్వే ప్రమాదాల చావులు బి.జె.పి ప్రభుత్వం వచ్చిన తర్వాత మరీ ఎక్కువయ్యాయి. ఏ ట్రాఫిక్‌నైతే లారీల వ్యవస్థను రైల్వేల నుంచి తీసుకొనిపోయిందో, ఆ మేరకైనా తిరిగి రాబట్టుకోవడానికి ఏమిచర్యలు తీసుకొంటున్నారో తెలియదు.

రహదారుల విషయానికి వస్తే ఫోర్‌లేన్ రహదారి నిర్మాణానికి కి.మీ.కు రూ. 4.5కోట్లు ఖర్చవుతుంది. అదే సిక్స్‌లేన్ అయితే రు.8.5కోట్లు ఖర్చు అవుతుంది. ఇందుకు నిధుల కోసం ప్రపంచ బాంకు నుంచి అప్పు తెచ్చుకోవటం, లేదా యూజర్ ఛార్జీలు పెంచటం ఒకటే కనబడుతోంది. ఉదాహరణకు ప్రస్తుతం దేశంలో ప్రధాన ప్రాంతాలను కలిపే జాతీయ రహదారి నిర్మాణానికి (మొదటి విడత) రు.30,300కోట్లు అవసరమవుతాయి. ఇందుకు సెస్ విధించటం, మార్కెట్ రుణాల ద్వారా 56శాతం నిధులు, ప్రపంచ బాంకు, ఏషియన్ డెవలెప్‌మెంట్ బాంకు, జపాన్ బాంకుల నుంచి 2.6శాతం రుణాలను తీసుకొని వచ్చింది. ఈ రుణాల మీద వడ్డీలు, రుణం తిరిగి చెల్లింపులకు మళ్లీ ప్రజల నెత్తిన భారాలు దించుతోంది. గ్రామీణ రహదారుల పథకం కింద రహదారేలేని 1.6లక్షల గ్రామాలకు రహదారులు నిర్మించడానికి అరవైవేల కోట్లు కావాల్సి వుంది. లారీలు ఉపయోగించే డీసిల్ మీద సెస్ విధించి (ఈ భారాన్ని చివరాఖరుకు ప్రజలే చెల్లించాలి) నిధులు సమకూరుస్తూ, అదే సమయంలో ప్రపంచ ఆర్థిక సహాయ సంస్థల నుంచి రుణసహాయాన్ని అర్థిస్తోంది. లేకపోతే టోల్‌టాక్సు విధిస్తుంది.

చూస్తుంటే, నిధుల సేకరణకు ప్రజల మీద భారం, రుణాలు ఈ రెండు మార్గాలే ప్రభుత్వానికి కనిపిస్తున్నట్లు తోస్తుంది. మరే ఇతర మార్గాలు లేవు.

ప్రయివేటీకరణ, లేక ప్రయివేటు పెట్టుబడిదారులతో కలిసి ఉమ్మడిరంగంలో నిర్మాణం ప్రభుత్వం ఆలోచన, ఆచరణ. కాని ప్రయివేటు రంగం ప్రభుత్వం ఆశించిన రీతిలో, ఆ మేరకు ముందుకు రావటం లేదు. (ఒక్క టెలిఫోన్ రంగంలో తప్ప) 1996లో ఒక నిపుణుల కమిటీ సమర్పించిన నివేదిక ప్రకారం ప్రభుత్వం, ప్రయివేటు సంస్థలు ఎంతెంత నిధులు సమకూర్చాలో కొన్ని లక్ష్యాలను ప్రకటించింది. ఈ లక్ష్యాలను ఎంతమేరకు నెరవేర్చాయో, అని చూడగా 97-98 నుంచి ప్రయివేటు రంగం ఆశించిన మేరకు నిధులను సమకూర్చలేక పోయింది.

97-98లో ప్రయివేటు రంగం జిడిపిలో 1.7శాతం నిధులను సమకూర్చాలనేది లక్ష్యం కాగా 1.3శాతమే సమకూర్చింది. ఆ తర్వాత సంవత్సరంలో రెండు శాతానికి గాను 1.4శాతం, 99-00లో 2.2శాతానికి గాను 1.4శాతం మాత్రమే సమకూర్చాయి. ఒకవేళ సమకూర్చాయనుకున్నా, వారు పెట్టిన పెట్టుబడిని లాభాలతో తిరిగి రాబట్టుకోవడానికి ప్రజలపై యూజర్ ఛార్జీలు, టోల్ టాక్సులు వసూలు చేస్తుంది. కొన్ని వంతెనల విషయంలో ఇది ఇప్పుడే ప్రారంభమైంది కూడా. ప్రభుత్వ రంగం కూడా అవసరమైన నిధులను సమకూర్చటం లేదు. మొత్తంమీద చూస్తే, నిధుల కొరత వల్ల లక్ష్యాలను చేరుకోవటంలో వైఫల్యమే కనపడుతోంది. (ఇందుకు సంబంధించిన పట్టికను రెండు రెళ్లు నాలుగులో చూడండి).

నిధుల కొరత తీర్చడానికి ప్రపంచ బాంకు ఉబలాటపడుతుంది ఎందుకు? శెట్టి ఊరికే వరదన కొట్టుకొని పోదని సామెత. బహుళజాతి సంస్థలు తమ ఉత్పత్తుల తయారీని ఇండియా లాంటి వర్ధమాన దేశాల్లోకి తరలించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇలాంటి దేశాల్లో, ముఖ్యంగా మనదేశంలో కార్మికులు, కంప్యూటర్ కూలీలు చవగ్గా లభిస్తారు. ఉత్పత్తి ఖర్చు తగ్గుతుంది. లాభాలు పిల్లలు పెడతాయి. వాళ్లు ఇక్కడ పరిశ్రమలు పెట్టాలంటే మౌలిక సౌకర్యాలు అవసరం. ఆ సౌకర్యాలు తామే ఏర్పాటు చేసుకొనే కన్నా మన ఖర్చుతో ఆ ఏర్పాట్లు చేసుకోవటం వారికి లాభదాయకం. వడ్డించిన విస్తరి ముందు కూర్చోవచ్చు.

సహజవనరుల దృష్ట్యా కాని మానవ వనరుల దృష్ట్యా కాని దేశం గొడ్డుపోలేదు. ఎక్కడ ఆర్థిక వనరులున్నాయో, వాటిని సంపూర్ణంగా ఉపయోగించుకునే సామర్థ్యం ఈ ప్రభుత్వానికి గాని, లేదా వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వం గద్దె దిగి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ ప్రభుత్వానికి లేదు, వుండబోదు. వామపక్ష, లౌకికవాద ప్రభుత్వాలు ఏర్పడే అవకాశం కనుచూపు మేరలో లేదు. ఆర్థిక వనరులెక్కడ వున్నాయో, వాటిని ఎలా సమీకరించాలో చూపించగలిగే ఒక ప్రత్యామ్నాయాభివృద్ధి ప్రణాళికను తయారుచేసి, దాని వెనుక ప్రజాబలాన్ని సమీకరించి, ప్రభుత్వం మెడలు వంచి, ఆ పథకాన్ని అమలు జరిపేలా చేయటమే ప్రస్తుతానికి ప్రజాతంత్ర, వామపక్ష శక్తులు చేయగలిగిన పని.

(ఈ వ్యాసంలో పొందుపరిచిన గణాంకాలు ఇటీవల రాష్ట్ర పారిశ్రామిక, వ్యాపార మండలుల సమాఖ్య ఏర్పాటుచేసిన గోష్టికి సమర్పించిన నేపథ్య పత్రాల నుంచి సేకరించబడ్డాయి.)

నిబద్ధతకు నారు పోసిన నార్ల వేంకటేశ్వరరావు (1908-1985)

- ఎన్. ఇన్నయ్య

ఓ పాత్రికేయునిగా పరిచయమైన నార్ల వేంకటేశ్వర రావు గొప్ప మానవతావాదిగా పరిణామం చెందడం, భావి తరాలకు స్ఫూర్తిదాయకం. మధ్యతరగతి రైతాంగ కుటుంబం నుండి వచ్చిన నార్ల, తన ప్రారంభపు దినాల్లో చాలా యిక్కట్లను ఎదుర్కొన్నారు. తాతలనాడే ఆంధ్రప్రదేశ్ నుండి వలసపోయి మహారాష్ట్రలో ఖాట్ని ప్రాంతంలో స్థిరపడ్డారు. నార్ల చదువు నిమిత్తం మళ్ళీ ఆంధ్రా వచ్చి పట్టభద్రులయ్యింది యిక్కడే. చిన్ననాటి నుండే రచనా వ్యాసంగం పట్ల మక్కువ చూపేవారు నార్ల. నాటి జాతీయోధ్యమ స్ఫూర్తి, ఆయన్ని తనతో మమేకం చేసుకుంది.

ప్రధానంగా నార్ల తన జీవనగమనంలో రెండు పార్శ్వాలను చవిచూశారు. యిందులో ప్రథమపార్శ్వం పాత్రికేయ ప్రవృత్తి. తెలుగుదిన పత్రికారంగంలో ఆయనో ఉత్తేజకెరటం. రెండో ప్రపంచ యుద్ధకాలం, జాతీయోధ్యమనంతరం ఆయన విశేష విశ్లేషణలకై పాఠకులు ఎదురుతెన్నులు చూసేవారు. నేటి చెన్నై నుండి నాడు వెలువడుతున్న 'ఆంధ్రప్రభ' దినపత్రికలో పాఠకులు వార్తా విశేషాల కన్నా ముందుగా నార్ల వారి సంపాదకీయాన్నే చదివేవారంటే అతిశయోక్తి కాదు!

పాత్రికేయునిగా కొనసాగుతున్నప్పుడే నార్ల ఇంగ్లీషు, తెలుగు భాషల్లో అనేక అంశాలపై వ్యాసాలను రాసేవారు. తెలుగు పత్రికారంగంలో అడుగిడక ముందు ముద్దూరి అన్నపూర్ణయ్య గారి 'కాంగ్రెస్' పత్రికతో మొదలై క్రమంగా భారతి, కృష్ణ పత్రిక, ప్రభ, జ్యోతి, ప్రజామిత్ర, స్వరాజ్యం వంటి పత్రికల్లో నార్ల రచనలు వెలువడుతుండేవి.

ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదక బాధ్యత, యితర పత్రికలతో ఈయనకున్న బాంధవ్యాలను కట్టడిచేసేసింది. అయినా అడపాదడపా......'మాటా-మంతీ', 'పిచ్చా-పాటీ' వంటి శీర్షికల్లోనూ 'కొత్తగడ్డ' వంటి నాటికల రూపాల్లోనూ నార్ల దర్శనమిస్తుండేవారు. ఆంధ్రప్రభ సంపాదకునిగా ఆయన పొందిన గుర్తింపు, రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యునిగా ప్రతిపాదింపచేసింది. సాహిత్య కళారంగాల్లో ఆయన అభిప్రాయాల వెల్లడికి ఈ పదవి ఓ 'వేదిక'గా సానుకూలమయ్యింది.

ఆంధ్రప్రభ బాధ్యత అనంతరం, మిత్రుల శ్రేయాభిలాషుల అండదండలతో విజయవాడలో ఓ దినపత్రికను ప్రారంభించారు. విజయవాడ ప్రచురణ కేంద్రంగా ఆ క్రమంలో 1960వ దశకం చివర్లో ఆంధ్రజ్యోతి సంపాదక బాధ్యతలను హైదరాబాద్‌లో చేపట్టడం జరిగింది. ఈ మలుపు నార్ల జీవనశైలినే మార్చివేసింది. అప్రతిహతంగా సాగే ధూమపానానికి చరమగీతం పాడేసి, శారీరకంగా, మానసికంగా దృఢ సంకల్పతకు నెలవైన వైనం కన్పిస్తుంది. ఈ క్రమం 25వేల పైచిలుకు ఇంగ్లీషు-తెలుగు పుస్తకాలకు నెలవైన అరుదైన గ్రంథాలయ రూపకల్పనకు బీజం వేసింది. దీంతో ప్రఖ్యాత పాత్రికేయులు, మేధావులకు అది సాహితీకేంద్రంగా, ఓ వేదికగా విలసిల్ల నారంభించింది. ఈ క్రమంలోనే నార్ల తాత్విక అభిమానిగా, మానవతావాదిగా ఆవిష్కరించారు.

ఈయన పలు విశ్వవిద్యాలయాల్లో చేసిన ఉపన్యాసాలు ప్రత్యేక విశ్లేషణలుగా ముద్రించారు. నార్ల వారు భగవద్గీత, ఉపనిషత్తులు, భారతీయ సంస్కృతి వంటి అంశాలపై చేసిన పరిశోధనలు ఆయన్నో నిబద్ధతా మానవతావాదిగా మలచాయి. ఈయన రాతలన్నింటినీ డి.ఆంజనేయులు పరిశీలించేవారు.

నార్ల వారికి ప్రేమనాథ్ బజాజ్, సుషై ముఖర్జీ, నిరంజన్ ధార్, వి.ఎమ్.తార్కుండే వంటి మహోన్నతులతో పరిచయాలు పెరిగాయి. ఎం.ఎన్. రాయ్‌ని నార్ల అధ్యయనం చేశారు. తొలిసారిగా ఎం.ఎస్.రాయ్‌ని నార్ల 1938లో చెన్నైలో చూశారు. అప్పటికాయన ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకులు. ఆ రోజుల్లో మహాత్మాగాంధీని రాయ్ వ్యతిరేకించేవారు. కాంగ్రెస్-పార్టీలో నూతనోత్సాహాన్ని నింపేందుకై గాంధీ అనేక ప్రత్యామ్నాయాలను వెదుకులాడుతున్న సమయం. అందులో ఒకటి రాజకీయాల్లో మత ప్రమేయం. దీన్ని రాయ్‌తో సహా నార్ల వంటి వారూ వ్యతిరేకించారు. విదేశాల నుంచి వచ్చిన రాయ్ ఓ ఆరేళ్ళ పాటు జైలు శిక్షననుభవించారు. సరిగ్గా యీ సమయంలో ఓ అరుదైన సంఘటన చోటుచేసుకుని, ఎమ్మెస్ రాయ్‌పై నార్ల వారు ద్వేషాన్ని పెంచుకునేలా చేసింది. అదేంటంటే.. ఒకసారి జరిగిన ఓ పత్రికా విలేకరుల సమావేశంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రిక సంపాదకులైన ఖాసా సుబ్బారావు గారు, రాయ్ సతీమణి ఎలెన్ పట్ల కొన్ని విమర్శలు చేశారు. దీనికి రాయ్ కోపోద్రిక్తులై సుబ్బారావ్‌ను తీవ్రంగా మందలించారు. విలేఖరులంతా ఆనాటి పత్రికా సమావేశాన్ని బహిష్కరించారు. అదే మన నార్ల వారైతే నాటినుండి తాను సంపాదకునిగా వ్యవహరించినంత కాలమూ ఎం.ఎన్.రాయ్ వార్తలను వేయకుండా నిషేధించారు. ఆయన(రాయ్) 1955, జనవరి 25న మరణించినప్పటికీ కనీసం సంపాదకీయాన్ని సైతం నార్ల రాయలేదు. తదనంతరం ఎ.జి.కె.మూర్తి, గుత్తికొండ నరహరి వంటి వారి ప్రమేయంతో... ఎమ్మెస్ రాయ్ రచనలు విస్తృతంగా చదివిన నార్ల, ప్రభావితులై 1956 ప్రథమవర్ధంతి సందర్భంగా ప్రత్యేక

సంపాదకీయాన్ని రాసారు. నాటినుండి ఆయన నెరపిన ఎం.ఎస్.రాయ్ అధ్యయనం నార్ల జీవనశైలినే మార్చివేసింది. తాను చదివిన అంశాలను డైరీలో నమోదు చేసుకునే ఉత్తమ అలవాటు నార్ల అభ్యున్నతికి అత్యున్నతంగా దోహదపడింది. గ్రంథాలయాల చుట్టూ, సెకెండ్ హాండ్ బుక్ స్టాల్స్ చుట్టూ తిరుగుతుండే పుస్తకాల పురుగు ఆయన.

హైదరాబాద్‌లో నార్ల కందుకూరి, గురజాడ, వేమన వంటి వారిపై ప్రత్యేక వ్యాసాలను వెలువర్చారు. ఓ ప్రత్యేక అధ్యయనం నెరపిన మీదటే ఆయనీ వ్యాసాలు రాసారు. భారతీయ సంస్కృతీ కళలపై చారిత్రక పరిశోధనలను, విభిన్న కోణాల్లో, దేశీయ-విదేశీయ రచయితల విశ్లేషణలోనూ అధ్యయనం చేసేవారాయన. వీటితోపాటు భగవద్గీత, ఉపనిషత్తులను సైతం అదే రీతిన అధ్యయనం చేయడం, చేయగలగటం గమనించదగ్గది. అంటే అనుకూల ప్రత్యానుకూల ధోరణులను సమదృష్టితో అధ్యయనం చేయడమన్న మాట. అలాగే ఈ అంశాలన్నింటి మీదా ఆయన పలు విశ్వవిద్యాలయాల్లో ఉపన్యాసాలనిచ్చారు.

నార్ల అధ్యయనం.... పురాతన కాలంలో ఉద్దాలకుడ్ని, అధునిక కాలం అధ్యాపకుడు హెన్రీ విదియాన్ డిరాజియోని సరిపోల్చడం ఓ ప్రత్యేకత. అలాగే ఎం.ఎన్.రాయ్ రచనల అధ్యయనం, ఆయనలోని మూఢవిశ్వాసాలను పటాపంచలు చేసి, స్వేచ్ఛా-భావనలకు పునాదులు వేసి ఆధునిక సమాజాన్ని/ఆధునిక భారతదేశాన్ని ఆవిష్కరింపచేసింది. భారతీయతలోని చీకటి వెలుగులను, అనుకూల, ప్రత్యానుకూలతలను గతం నుండి వర్తమానం వరకూ ఆయన అధ్యయనం చేశారు.

"సందేహనివృత్తికి అవకాశం యివ్వని, పవిత్ర గ్రంథాల అధ్యయనమే" భారతదేశ వెనకబాటు తనానికి కారణమని" ఆయన ప్రగాఢ విశ్వాసం. యిక ఆధునిక భారతదేశానికొస్తే.... స్వాతంత్ర్య సముపార్జనకు మతం రాజకీయాల్లోకి వచ్చింది. బ్రిటిష్ పాలనా ప్రతిఘటనకు చట్టాన్ని అతిక్రమించాడు గాంధీ. ఆయన సత్యాగ్రహం హింసకు దారితీసింది. యిందుకు కారణం గాంధీకి జీవిత పార్శ్వాలలో ఏ ఒక్కదాని పట్ల శాస్త్రీయ అవగాహన లేకపోవటమే. అనుదినం గీతను పఠిస్తూ గుడ్డిగా వర్తించడమే ఆయన దినచర్య. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ పాత్రను కొనియాడుతూనే, సమస్యల పరిష్కారంలో ఆయన అనుసరించిన మతతత్త్వ వైఖరిని నిరసించేవారు నార్ల.

నార్ల భారతీయ సాంస్కృతీ విలువలను, లోపాలను ఎత్తిచూపుతూ ఖర్మ, పునర్జన్మ వంటి భావాలను వీడాలని యువతకు పిలుపునిచ్చారు. హైందవ సంస్కృతీ విలువలను పునరుద్ధరణ, శాస్త్రీయ విప్లవం, మానవతల దిశగా మళ్ళించాలని కోరారు. తద్వారా మానవతా విలువల పునరుద్ధరణ, ఎవరి సమస్యలను వారే పరిష్కరించుకునే దిశగా దోహదపడి అంతిమంగా అభివృద్ధి చెందిన ఏదేశంతోనైనా మనం పోటీపడగలమని నార్ల ప్రతి ఒక్కరికీ విన్నవించారు..

1975 నాటి ఎమర్జెన్సీ కాలంలో ప్రాథమిక హక్కుల్ని పాలకులు తుంగలో తొక్కినప్పుడు మనస్సాక్షికి కట్టుబడ్డ పాత్రికేయుడిగా నార్ల, వారి దినపత్రిక ఎడిటోరియల్ కాలమ్ స్పేస్‌ను ఖాళీగా వదిలేసి తన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. నాటి కాంగ్రెస్‌కు కొమ్ము కాస్తున్న యాజమాన్యం యిందుకు అంగీకరించక పోవడంతో, నార్ల అమెరికా యాత్రకు వెళ్ళిపోయారు. కొంత మనస్తాపం తగ్గాక తిరిగొచ్చి అలవాటుగా తన సంపాదకుని పదవికి రాజీనామా చేసి బైటపడ్డారు.

తాను రాజ్యసభ సభ్యునిగా ఉన్నకాలంలో సమస్యల పరిష్కారం వట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధి లేనితనాన్ని, అవినీతిమయ రాజకీయనేతల దృష్టాంతాలను సన్నిహితంగా పరిశీలించే వెసులుబాటు దొరికింది.

కులరాజకీయాలకు నెలవైన విశ్వవిద్యాలయాల ధోరణులను ఖండించేవారు. ఓసారి ఏమయ్యిందంటే.... జి.వి.కృష్ణారావుగారనే మేధావి 'కళాపూర్ణోదయం' మీద ఓ పరిశోధక సిద్ధాంతాన్ని 1950లలో మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించారు. పరిశీలకులుగా వచ్చినవారు కులప్రాతిపదికన కృష్ణారావు గారి పరిశోధనను నిలుపుచేయాలని భావించారు. పట్టభద్రుడుగా పరిశోధక పత్రాన్ని సమర్పించేందుకు ఒక్క కృష్ణారావ్ గారికే అవకాశం యిచ్చారు.

పరిశీలకులు కృష్ణారావ్‌గారి ఆంగ్ల భాషా పాటవంలో తప్పులను వెలికితీసి పరిశోధనను తిప్పికొడదామనుకుని నివేదికలను సమర్పించారు - ఉపకులపతికి, నార్లగారు పరిశీలకుల నివేదికల్లో లోపాలను ఎత్తిచూపి, నాటి ఉపకులపతి (వైస్ ఛాన్సలర్) గోవిందరాజుల నాయుడుకు ఘాటుగా ఓ లేఖ రాశారు. కృష్ణారావ్ గారి పరిశోధనకు న్యాయం జరక్కుంటే మొత్తం వ్యవహారాన్ని బైటపెడతానని హెచ్చరించారు. పరిశీలకులు ఈ హెచ్చరికతో కాస్త వెనుకడుగు వేసి, కృష్ణారావ్ గారికి డాక్టరేట్‌ను సిఫార్సు చేయల్సి వచ్చింది. గుంటూరు జిల్లాకు చెందిన సూర్యదేవర సంజీవ్‌దేవ్‌ను పాఠకులకు పరిచయం చేసింది నార్లగారే.

సమాజంలో అన్యాయం, అక్రమం జరిగితే సహించలేక పోయేవారు నార్ల. ఈ కారణంగా నాటి ముఖ్యమంత్రులు టంగుటూరి, నీలం, కాసు వంటి ప్రముఖులకు సైతం కంటగింపయ్యారు. 1969వ సంవత్సరంలో కాసు బ్రహ్మానందరెడ్డిగారు నార్లవారి విమర్శలను తట్టుకోలేక, పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ఏకంగా బిల్లునే ప్రవేశపెట్టేందుకు ఉద్రిక్తులయ్యారు. పాత్రికేయుల ఆందోళన, పాలకుల్ని పునరాలోచింపజేసింది. అలాగే నీలం సంజీవరెడ్డి గారి ఏలుబడిలో రాయలసీమ - ఆంధ్రా అన్న ప్రాంతీయ వివక్షతలు తలెత్తినప్పుడు, ఎండగట్టింది మన నార్ల గారే.

అనేక బహిరంగ సభల్లోనూ, సమావేశాల్లోనూ, సదస్సుల్లోనూ నార్ల పాల్గొన్నా, ఉత్తమవక్త మాత్రం కాలేకపోయారు. దీంతో ఆయన చేతలమనిషి గానూ, రాతలమనిషి గానే ప్రసిద్ధి పొందారు.

(మిగతా 13వ పేజీలో)

భారత-పాకిస్తాన్ మైత్రి: స్పష్టతలేని వైఖరి

-కె. బాలగోపాల్

రాజకీయాలలో అబద్ధాలు మామూలే గానీ అంతర్జాతీయ రాజకీయాలు ఈ విషయంలో ఆంతరంగిక రాజకీయాల కన్నా మరీ అధ్వాన్నం. ఎందుకంటే పదవికోసమో పార్టీ శ్రేయస్సు కోసమో అబద్ధం చెప్పటం తప్పనుకునే వారు సహితం దేశంకోసం అబద్ధం చెప్పటంలో తప్పేమీలేదని భావిస్తారు. దానిని అబద్ధంగా గుర్తించడానికి సహితం చాలా మంది సిద్ధపడరు. తెలుగుదేశం-కాంగ్రెస్ పార్టీల సంవాదాన్ని అబద్ధాల పంచాంగం అనినంత సులభంగా భారత-పాకిస్తాన్‌ల సంవాదం గురించి అనగలమా?

అనలేముగానీ వాస్తవానికది అబద్ధాల పంచాంగమే. మన పాలకులు ఒకేసారి పాకిస్తాన్ గురించి ఎన్ని నోళ్లతో మాట్లాడుతున్నారో గమనించండి. అద్వానీ మన దేశం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు- (ఒక్క కరవు సమస్యను మినహాయించి)- పాకిస్తాన్ మీద నిందవేసి తిడుతుంటాడు. ఆయన అభిప్రాయాన్నే భారత ప్రభుత్వం అభిప్రాయాలని భావించినట్టయితే భారత్ దృష్టిలో పాకిస్తాన్ ఒక భయంకరమైన కుట్రదారు, రాక్షసి అని భావించవలసి ఉంటుంది. నిన్నటికి నిన్న నకిలీ స్టాంపుల కుంభకోణంలో కూడా పాకిస్తాన్ హస్తం చూసేదాకా పోయాడాయన.

ఇక దేశ ప్రధాని మాటకొస్తే అన్ని విషయాలలాగే ఈ విషయంలోనూ ఆయనకు ఒక నిలకడయిన వైఖరి లేదు. 'సీమాంతర ఉగ్రవాదాన్ని' రెచ్చగొడుతున్న టెర్రరిస్టు దేశంగా ప్రపంచం నేత పాకిస్తాన్‌ను గుర్తింపజేయాలన్న ఆరాటం ఒక చివర, స్నేహ హస్తం మరొక చివర, మధ్యలో అప్పటి శ్రోతలను బట్టి రకరకాల అభిప్రాయాలు ఆయన నోటి నుండి వింటుంటాం. పాకిస్తాన్‌తో కాశ్మీర్ సమస్యతో సహా అన్నీ చర్చించడానికి సిద్ధమేనని ఇవ్వాళ అనగలగడం, ఆ సంగతి మనం రేపు పత్రికలలో చదివి హర్షింపచేయాలంటే పాక్ ఆక్రమిత కాశ్మీరును మనకు వెనక్కి ఇచ్చే విషయం తప్ప పాకిస్తాన్‌తో కాశ్మీర్ గురించి మాట్లాడేది ఏమీలేదని అనగలడు.

రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండెజ్‌కు భారత పాకిస్తాన్‌లు రెండు దేశాలుగా, రెండు సమాజాలుగా కాక రెండు 'సైన్యాలుగా' కనిపిస్తున్నాయి. ఆయన దానికి ఉచితమైన భాషే మాట్లాడతాడు. విదేశాంగ మంత్రి యశ్వంత్ సిన్హా కొంచెం అద్వానీలాగా కొంచెం జార్జి ఫెర్నాండెజ్‌లాగా మాట్లాడుతుంటాడు.

వీటిలో దేనిని పాకిస్తాన్ పట్ల భారత్ వైఖరిగా భావించాలి? అసలు భారత్‌కు పాకిస్తాన్ పట్ల ఒక నిర్దిష్టమైన వైఖరి ఉందని భావించాలా?

నిజం చెప్పాలంటే మన దేశనాయకులెవ్వరికీ పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరచుకోవడం పట్ల చిత్తశుద్ధి లేదు. కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ మనల్ని ఇబ్బంది పెట్టకుండా చూసుకోవడమొక్కటే మన నాయకులకు కావలసింది. అమెరికాను మంచి చేసుకొని కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ చేతులూ, నోరు కట్టేస్తే ఇక ఆ పైన పాకిస్తాన్ అనే దేశమొకటి ఉందనే మరచిపోయి బతకొచ్చని వారి అభిప్రాయం. 'సెప్టెంబర్ 11' తరువాత ఈ అవకాశం పెరిగిందని గట్టిగా నమ్ముతున్న వారిలో అద్వానీ ముఖ్యుడు. ఆ గాలి ఇటు మళ్లించి పాకిస్తాన్ బెడదను ఒక్కసారిగా వదిలించేసుకుందామని అతని ఉబలాటం. అద్వానీ బయటపడి మాట్లాడుతున్నాడు గానీ వారి ఖాకీ నిక్కరు వ్యాయామశాల లోపనే కాక దానికి వెలుపల కూడా చాలా మంది భారతీయుల వైఖరి ఇదే. పాకిస్తాన్‌తో స్నేహ సంబంధాలు వాటంతటవి విలువయినవంటే ఈ వైఖరి ఒప్పుకోదు. పోనీ శాంతి కోసం స్నేహ సంబంధాలు అవసరమంటే, బెదిరించి శాంతి నెలకొల్పడం అంతకంటే సులభమైన మార్గం కాదా అంటుంది. అణుబాంబు అందుకోనే తయారుచేసుకున్నారు- దానిని చూసి పాకిస్తాన్ కూడా భయపడి కాశ్మీర్ సంగతి మరచిపోయి మనతో రాజీకొస్తుందని. మన అణు విస్ఫోటనానికి ప్రతిగా పాకిస్తాన్ కూడా అణు విస్ఫోటనం చేపట్టేసరికి ఈ ఆశ కుప్పకూలిపోయింది. ఇప్పుడు అణుబాంబు బదులు అమెరికానుచేతిలో పెట్టుకొని పాకిస్తాన్‌ను భయపెట్టాలని చూస్తున్నారు. అంతే తప్ప పాకిస్తాన్‌తో స్నేహ సంబంధాలు నెలకొనాలన్న చిత్తశుద్ధి ఎవరిలోనూ లేదు. నిన్న మొన్న మన వాళ్లు అమలుచేయడానికి ఒప్పుకున్న కాల్పుల విరమణ కూడా అమెరికాను మెప్పించే ఎత్తుగడలో భాగమే తప్ప వేరే ఏమీ కాదు.

వాజ్‌పేయి లాహోర్‌కు పోలేదా, ముషార్రఫ్‌ను ఆగ్రాకు పిలవలేదా అంటారేమో. పోయాడు, పిలిచాడు. అది వాజ్‌పేయి పాకిస్తాన్ పట్ల అనుసరిస్తున్న రెండు నాల్కల వైఖరిలో భాగం. తన పదవి ముగిసేలోగా పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరచి 'చరిత్రలో నిలిచిపోవాలన్న' కాంక్ష వాజ్‌పేయిలో బలంగా ఉందన్న అభిప్రాయమొకటి విశ్లేషకులలో ఉంది. అందులో భాగంగా ఆ ప్రయత్నాన్ని అర్థం చేసుకున్నా తప్పులేదు. అయితే దానిని అద్వానీ పనిగట్టుకొని చెడగొట్టాడనేది ఇప్పుడు బహిరంగ రహస్యం. కొంత సామరస్యపూరితమైన ఉమ్మడి ప్రకటన

ఆగ్రాలో తయారయ్యే స్థితి వచ్చింది గానీ అద్వానీ అడ్డుపడడం వల్ల అది సాధ్యం కాలేదు. వాజ్‌పేయికి చరిత్రలో ఒకరకంగా 'నిలిచి పోవాలని' ఉన్నట్లే అద్వానీకి ఇంకొక రకంగా 'నిలిచి పోవాలని' ఉంది మరి!

అయితే లాహోర్-ఆగ్రా ప్రయత్నాలను పాకిస్తాన్ విశ్లేషకులు చూసిన తీరును పరిశీలిస్తే ఇదికూడా నిజానికి భారత్ పాకిస్తాన్ పట్ల ఎప్పుడూ అనుసరిస్తున్న వైఖరికి భిన్నం కాదని అర్థం అవుతుంది. మనవాళ్లు అప్పట్లో పాకిస్తాన్ నుండి రాబట్టాలని చూసిన ప్రకటన ఏమిటి? కాశ్మీర్‌ను పక్కన పెట్టి ఇతర సమస్యలు పరిష్కరించుకొనడానికి పాకిస్తాన్ సిద్ధమనే ప్రకటన రాబట్టాలని చూశారు. అయితే ముషారఫ్ పదే పదే అంటున్నట్లు కాశ్మీర్ కాక వేరే ఏ సమస్యలున్నాయి భారత్-పాకిస్తాన్‌ల మధ్య? నదీజలాలు, వర్తక వాణిజ్యాలు మొదలైనవి ఎప్పుడైనా ఉండే మోతాదులోని సమస్యలే తప్ప అంత ఆర్భాటంగా శిఖరాగ్ర సమావేశం నిర్వహించుకోనిదే పరిష్కారం కానివేవీకావు.

ఒకవేళ ఉన్నాయనే అనుకున్నా కాశ్మీర్‌ను పక్కనపెట్టి వాటి గురించి మాట్లాడుకుందామన్న ప్రతిపాదన వెనుక కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ బెడద వదిలివేసుకుందామన్న ఆరాటమే తప్ప వేరే సదుద్దేశ్యమేమీ లేదన్న పాకిస్తాన్ విశ్లేషకుల వ్యాఖ్యను కొట్టిపారేయలేము. సులభంగా పరిష్కారం కాగల సమస్యలతో మొదలుపెట్టి చర్చలు ప్రారంభిస్తే, కష్టతరమైన కాశ్మీర్ సమస్య పరిష్కారానికి కావలసిన స్నేహ వాతావరణం ఏర్పడుతుందని మనవాళ్లు చాలా తెలివిగా సూచిస్తున్నారుగానీ అవన్నీ పరిష్కారం అయిపోయిన తరువాత భారత్ కాశ్మీర్ విషయం మరచిపోయి ఇంటికి వెళ్లిపోదన్న నమ్మకం ఏమిటని వారి వాదన.

కాశ్మీర్ విషయం పాకిస్తాన్‌తో మాట్లాడడానికి భారత్ సిద్ధంగా లేదంటున్నారు, పాకిస్తాన్ మాత్రం సిద్ధంగా ఉందా అంటారేమో. చాలా కాలం పాటు పాకిస్తాన్ పాలకుల వైఖరీ ఇదే. అమెరికా చేయూతనిస్తే యుద్ధం చేసి కాశ్మీర్ వివాదాన్ని పరిష్కరించుకోవాలని పాకిస్తాన్ చూసింది. అయితే 1971 'బంగ్లాదేశ్ యుద్ధం' తరవాత, బంగ్లాదేశ్ వేర్పాటు తరవాత, ఆ ఆలోచన బలహీనపడింది. 1989లో కాశ్మీర్‌లో స్వయం నిర్ణయాధికార పోరాటం మొదలైన తరవాత పాకిస్తాన్‌కు మరొకసారి కాశ్మీర్ వివాదాన్ని తనకు అనుకూలంగా పరిష్కరించుకునే అవకాశం లభించింది. ఒక పాకిస్తానీ మానవహక్కుల ఉద్యమకారుడు వ్యాఖ్యానించినట్టు, కాశ్మీరీల స్వయం నిర్ణయాధికారం విషయంలో పాకిస్తాన్‌ది విచిత్రమైన వైఖరి. కాశ్మీరీలకు పాకిస్తాన్‌ను కోరుకునే మేరకు మాత్రమే స్వయం నిర్ణయాధికారం ఉంటుంది. స్వతంత్రంగా బతకాలని కోరుకునే అధికారాన్ని పాకిస్తాన్ ఒప్పుకోదు.

ఏమయితేనేం కాశ్మీరీలు స్వయం నిర్ణయాధికార పోరాటానికి పాకిస్తాన్ చాలా సహాయం చేసింది, చేస్తున్నది. ఆ సహాయమే లేకపోతే కాశ్మీరీలు ఇప్పటిదాకా పోరాటం చేయగలిగేవారు కారు. పాకిస్తాన్ ఉద్దేశ్యాలు ఏవయినా కాశ్మీరీల ఆరాటం న్యాయమైనదే కాబట్టి ఈ విషయంలో పాకిస్తాన్ ఒక చారిత్రిక కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నదని ప్రపంచంలోని అత్యధిక దేశాల అభిప్రాయం. (మన పత్రికలో మనకు వినపడకుండా దాచి పెడుతున్న ప్రపంచ సత్యాలలో ఇదొకటి).

అయితే ఈ సహాయాన్ని కాశ్మీరీలకు చేసే సహాయంగా చూసినా, పాకిస్తాన్ తన తొలినాటి ఆకాంక్షను పరిపూర్తి చేసుకోవడానికి జరుపుతున్న కృషిగా చూసినా, ఈ బరువు, ఈ ఖర్చు, పాకిస్తానీ సమాజం ఇంకెంత కాలం మోయాలన్న ప్రశ్న ఒకటి పాకిస్తాన్‌లో మొలకెత్తింది. పాకిస్తాన్ ఒక ఆధునిక పారిశ్రామిక దేశంగా అభివృద్ధి చెందాలని కాంక్షించే మధ్యతరగతి ఆ దేశంలో కొంత బలపడింది. వారు ఈ ప్రశ్న బలంగా లేవదీస్తున్నారు. ఇది పాకిస్తానీ పాలకులను ప్రభావితం చేస్తున్నదని భావించడానికి ఈమధ్యనే ఇండియాలో పర్యటించిన పాకిస్తానీ జమాతెఇస్లామీ నాయకుడి ప్రకటన ఒక నిదర్శనం.

దీనికి ఒక నేపథ్యం ఉంది. అది అమెరికా సామ్రాజ్య విస్తరణ వ్యూహంలోని దుర్మార్గపు ఎత్తుగడల పర్యవసానం. అఫ్ఘానిస్తాన్ నుండి రష్యాను తరిమివేయడానికి అమెరికా 'ఇస్లామిక్ ముజాహిద్దీన్'ల సైన్యాన్ని తయారుచేసిన సంగతి తెలిసిందే. ఇస్లాంను వ్యాపింప చేయడానికి ముస్లింలు ఎక్కడున్నా అక్కడ సనాతన ఇస్లామిక్ రాజ్యాలు స్థాపించడానికీ ఆయుధాలు పట్టుకొని బయలుదేరడానికి తయారుగా ఉన్న సాయుధ జిహాదీలు అప్పటిదాకా ఒకటి రెండు పశ్చిమాసియా దేశాలలో చిన్న చిన్న గుంపులుగా ఉండేవారు. వారంతటవారు అంతకంటే ఎప్పటికీ ఎదగక పోదురేమో. కానీ అమెరికా తన అఫ్ఘానిస్తాన్ ప్రతి వ్యూహం కోసం వారందరినీ ఒక చోట చేర్చి మిలిటెంట్ల ఫ్యాక్టరీ నెలకొల్పింది.

ఆ 'చోటు' పాకిస్తాన్. అప్పటి నుండి పాకిస్తాన్‌లో వీధివీధికీ ముజాహిద్దీన్‌లు తయారయ్యారు. అమెరికా వ్యూహం ఫలించింది. రష్యా, అఫ్ఘనిస్తాన్ నుండి వెళ్లిపోయింది, కానీ అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ చాలా నష్టపోయాయి. మతహింసకు స్థావరాలయ్యాయి. దానినుండి అఫ్ఘానిస్తాన్‌ను 'కాపాడడానికి' అమెరికాయే ఆ దేశం మీద మరొకసారి యుద్ధం చేయడం వేరేకథ.

పాకిస్తాన్‌లో అమెరికా విత్తనం నాటిపోయినా పాక్-ఇస్లామిక్ మిలిటెన్సీ పట్ల ఆ దేశంలోని ఆలోచనాపరులలో వ్యతిరేకత బాగా పెరిగింది. వారంతా హేతువాదులు, నాస్తికులు, కమ్యూనిస్టులు

కారు. పాకిస్తాన్ ఒక ఆధునిక దేశంగా ఎదగాలని కోరుకుంటున్న వారందరూ ఈ సాయుధ జిహాదీలు పెద్ద ఆటంకం అని గుర్తిస్తున్నారు. వాళ్లు ఇతర ప్రాంతాలలో కాశ్మీర్ నుండి చెచెన్యా దాకా పోరాటాలు చేయడమేకాక పాకిస్తానీ సమాజాన్ని సాయుధంగా శాసించే ప్రయత్నం కూడా చేస్తున్నారు.

ఇండియాతో కాశ్మీర్ వివాదాన్ని ఏదో ఒకరకంగా తెంపుకోనంత కాలం ఈ మిలిటెంట్ల బెడద పాకిస్తాన్‌కు పోదని పాకిస్తాన్‌లో చాలామంది ఈ రోజు భావిస్తున్నారు. ఆ ఒత్తిడి పాకిస్తాన్ పాలకుల మీద ఉంది. అందుకు భిన్నమైన దిశగా ఒత్తిడి పెట్టే ప్రభావాలూ లేవా అంటే ఉన్నాయి. అయితే ఈ కారణంగా పాకిస్తాన్ పాలకులు ఇండియాతో చర్చలు జరిపే విషయంలో మనవాళ్ల కంటే కొంచెం సిన్సియర్‌గానే ఉన్నారు.

మన సమస్య ఏమిటంటే పాకిస్తాన్‌ను ఒక ఇస్లామిక్ భూతంగానే తప్ప ఇంకొకరకంగా మనం చూడలేం. ఆ దేశంలోనూ భిన్న ఆరాటాలు, ఆకాంక్షలూ ఉన్నాయన్న ప్రాథమిక సత్యాన్ని సహితం మనం గుర్తించం. మన రాజకీయాలు, మన పత్రికలు, ఈ మధ్యకాలంలో సినిమాలు పాకిస్తాన్ గురించి ఒక మూస అభిప్రాయాన్నే కలిగిస్తున్నాయి, పెంచి పోషిస్తున్నాయి.

మనం మారనిదే మన పాలకులు ఎందుకు మారుతారు? వాళ్ల వైఖరి మార్చుకోవాలన్న ఒత్తిడి మన నుండి రానిదే అదెందుకు మారుతుంది? కానీ దీనికి కావలసిన కృషి చేయడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు? జాతీయవాద ఆవేశంతో ఉన్న సుఖం, హేతుబద్ధమైన వివేచనలో లేదు. అయితే దానిని బలంగా చేపట్టకపోతే మాత్రం భారత-పాకిస్తాన్ చర్చల పేరుతో అబద్ధపు ప్రహసనం సాగుతూనే ఉంటుంది. మొన్న ప్రకటించినట్టు కాల్పుల విరమణ అప్పుడప్పుడు ప్రకటించడమూ జరుగుతుంటుంది. మరొక పక్క ఆయుధాల తయారీ, కొనుగోలు, దిగుమతి, సైన్యాల మోహరింపు సాగుతూనే ఉంటాయి.

(10వ పేజీ తరువాయి)

నిబద్ధతకు నారు పోసిన నార్ల వేంకటేశ్వరరావు (1908-1985)

నార్ల రాసిన "సీతజోస్యం" అనే నాటకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. పాఠకలోకంలో తీవ్ర చర్చకు తెరతీసిందీ రచన. సాహిత్య అకాడమీయే (ఈ రచనపై) తీవ్ర విమర్శ చేసింది. ప్రచురణ కర్తలే విమర్శించడం తగదని నార్ల తీవ్ర అభ్యంతరాన్ని లేవనెత్తారు. ఈ కారణంగానే సాహిత్య అకాడమీ వారి పురస్కారాన్ని సైతం నార్ల తిరస్కరించారు. అలాగే విశ్వనాథ సత్యనారాయణ, గుడిపాటి వేంకటాచలం రచనలను నార్ల తిరస్కరించారు.

తరువాతి క్రమంలో నార్ల రాసిన మరో నాటకం, 'నరకంలో హరిశ్చంద్ర'. దీన్ని ఈ వ్యాస రచయితకే అంకితమిచ్చారు. మరోనాటకం "ద్రౌపతి". ముందు "పాంచాలి" అని పేరిడి తరువాతి క్రమంలో ద్రౌపతిగా మార్చారు. నార్ల వారి రచనల్లో పాత-కొత్త వాటిన్నీ ఎంపికచేసి ప్రచురించారు. పురాణ వైరాగ్యమనే అసంపూర్ణ రచన సైతం వుంది. నార్ల తన భావాలను, నవయుగాల బాట నార్లమాట అన్న ముగింపుతో వేయికిపైగా పద్యాలను వెలువర్చారు. వీటిల్లో సాంఘిక దురాచారాల పట్ల ఘాటైన విమర్శ, మానవ విలువల పునరుద్ధరణ లక్ష్యంగా కనిపిస్తుంది. వివిధ అనుభవాలను, అనుభూతులను, విరుద్ధ వ్యక్తులతో ఎదుర్కొన్న ముఖాముఖి సందర్భాలను రాయాలని తపన పడ్డా వివిధ కారణాల మూలంగా వెయ్యివరకూ రాయలేకపోయారు. చివరిరోజుల్లో ఎన్టీఆర్ ప్రభుత్వానికి సాంస్కృతిక సలహాదారుగా సైతం నార్ల వేంకటేశ్వరరావు గారు కొద్దికాలం సేవలందించారు.

నార్ల సతీమణి సులోచన అన్నివిధాలా వారికి సహకరించారు. తమ సహజీవనంలో నార్ల నమ్మింది ఆచరణలో పెట్టగల ధీరోదాత్తుడు. పిల్లలలో కొందరు కులాంతర వివాహాలను చేసి వారిని ప్రోత్సహించారు. రెండు విశ్వవిద్యాలయాలు "డాక్టరేట్"లతో ఆయన్ని గౌరవించినా, ఒక్కనాడూ ఆయన పేరుముందు 'డాక్టర్' అని పెట్టేందుకు ఆయన అనుమతించలేదు. నమ్మింది ఆచరిస్తూ...... పాత్రికేయ లోకానికి చిరస్మరణీయుడు, ఆదర్శప్రాయుడుగా నిలిచారు శ్రీ నార్ల వేంకటేశ్వరరావు.

స్వేచ్ఛానువాదం : విద్యాభూషణ్

చందాదారులకు విజ్ఞప్తి

మొదటి సంచిక నుంచి చందాదారులుగా చేరినవారి చందా డిసెంబరు నెలాఖరుతో ముగుస్తుంది. వారు అంతా తిరిగి చందాదారులుగా చేరి వార్షిక చందా 120 రూ.లను మనీఆర్డరు లేదా డ్రాఫ్టు రూపంలో పంపడం ద్వారా మా ఈ కృషికి మీ సహకారాన్ని అందించాలని కోరుతున్నాం.

సం./-

దశాబ్దాల భారత చరిత్ర : స్కాంలు, అపవాదులు, కళంకాలు

గత కొన్ని దశాబ్దాలుగా నెలకొంటున్న అనేక అసహ్యకర పరిస్థితులు మనదేశాన్ని నవ్వుల పాలు చేస్తున్నాయి. మన పరువు ప్రతిష్ఠల్ని మంటగలుపుతున్నాయి. ఈ పరిస్థితుల్ని చూస్తూ ఉంటే దేశమంతా అవినీతి మంటల్లో దగ్ధమవుతున్న అభిప్రాయం కలగక మానదు. ఈ పరిస్థితుల్ని తొలగించే ప్రయత్నాలు కూడా జరగడం లేదు. అందుకు తక్షణం ఒక ప్రక్షాళనోద్యమం చేపట్టడం అవసరం.

ప్రస్తుతం మనదేశంలో నెలకొన్న నికృష్ట పరిస్థితుల్ని కళ్ళకు కట్టే కొన్ని కుంభకోణాల్ని, మోసాన్ని, అవినీతి చర్యల్ని వివరించే ప్రయత్నం ఇది.

భోఫోర్స్ కుంభకోణం

దేశానికి అతిముఖ్యమైన రక్షణ సామాగ్రిని విదేశాల నుండి కొనుగోలు చేయడంలో జరిగిన కుంభకోణమే 'భోఫోర్స్ స్కాం'. 65కోట్ల రూపాయలు అవినీతి పాలయ్యాయన్న ఆరోపణల్ని ఎదుర్కొన్న కుంభకోణం దాదాపు 15ఏళ్ళ క్రితం జరిగింది. ఒప్పందాలపై సంతకాలు చేసిన ఉన్నతాధికారులు అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ఆదేశాల మేరకు తమ సూచనల్ని, సిఫారసుల్ని మార్చుకున్నారని అధికార పత్రాలు వెల్లడించాయి. ఈ కేసు 12సంవత్సరాలుగా కోర్టుల్లో నత్తనడక నడుస్తోంది. ఇప్పటికీ ముగింపుకు వచ్చే సూచనలేవీ కనిపించడం లేదు. సాంకేతిక కారణాల వల్లా, ఈ కుంభకోణంలో ప్రమేయం ఉన్నవారి నేర్పరితనం వల్లా ఈ కేసు ఏదో ఒక కోర్టులో పెండింగులో పడి ఉంటోంది. ప్రధాన నిందితుల్లో ఇద్దరు, దుబాయికి చెందిన మాజీ ఏజంటు విన్‌చద్దా, మరో మాజీ రక్షణ కార్యదర్శి మరణించారు.

మిగిలిన వారిలో మరో ఇద్దరిని- ఇటలీకి చెందిన ఒట్టావియో ఖత్రోచి, మార్టిన్ అర్డోలను- ఏదో ఒక కారణం వల్ల చాలాకాలంగా మనకు అప్పగించడం జరగలేదు.

మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు కూడా జెఎంఎం ముడుపుల కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొన్నారు. 'ఫోరెక్స్' చట్టాలను అధిగమించి రూ. 35కోట్లు ఏవిధంగా పార్టీ ఖాతాలో జమ అయ్యాయో వివరించడంలో అప్పటి అధికార పార్టీ కోశాధికారి సీతారామ్ కేసరి విఫలమయ్యారు.

పశుగ్రాస కుంభకోణం

బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ పశుగ్రాస కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. భారీగా ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి, కంటికి కనిపించని పశుగ్రాసం కొనుగోలు చేశారు. ఈ కుంభకోణంలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయలు గల్లంతయ్యాయి. కొన్నామని చెప్పిన సరుకు కూడా తక్షణమే కనుమరుగయ్యింది. ఈ కేసు ఆరేళ్ళుగా నడుస్తోంది. నేటికీ ముగింపుకు వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఈలోగా, ముఖ్యమంత్రి జైలుకు వెళ్ళడంతో ఆయన భార్య రబ్రీదేవి ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టడం విశేషం. ఆమె భర్త జైలునుండి బయటకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన, రాజకీయ వ్యవహారాలు నిర్వహించడం మొదలుపెట్టారు. తర్వాత ఆయన కేంద్ర శాసనవ్యవస్థలో ఎగువసభకి ఎన్నికయ్యారు కూడా! ఆయన వద్ద చాలా డబ్బు లభించిందని, అది అంతా పశుదాణా కుంభకోణంలో రాష్ట్రంలోని వివిధ ట్రెజరీల నుండి డ్రా చేసిన వెయ్యి కోట్ల రూపాయల్లోనిదేననీ సిబిఐ నిర్ధారించింది. అనేక కేసులు నమోదు చేసింది. ఈలోగానే బీహార్‌లో 400కోట్ల రూపాయల 'బైతుమిన్' కుంభకోణం కూడా వెలుగుచూసింది.

ఉత్తరప్రదేశ్ మందుల కుంభకోణం

ఉత్తరప్రదేశ్‌లో బోగస్ ఆయుర్వేద మందుల కొనుగోళ్ళలో 63కోట్ల రూపాయలు గల్లంతయ్యాయి. ఈ కేసు కూడా కోర్టుల్లో నానుతోంది. ఆర్థిక నియంత్రణ కుప్ప కూలిందని, ఆడిట్ సూత్రాలను గాలికి వదిలారని కోర్టులు వ్యాఖ్యానించాయి.

రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీల పనివిధానంపై రాష్ట్రాల అకౌంటెంట్ జనరల్ ప్రతినెలా సమీక్షా బులిటెన్లు ప్రచురిస్తారు. బీహార్‌లో 1994-95లో ఐదు సంవత్సరాల కాలానికి ఒకే ఒక్క బులిటెన్ తేగలిగారు. అనేక రాష్ట్రాలలో 'కిగ్' తనిఖీలు నత్తనడక నడుస్తున్నాయి. రాష్ట్రాలు ప్రచురించే లెక్కలలో అనేక అవకతవకలున్నాయని అనేకసార్లు తేలింది. ఆడిట్ నివేదికలను పబ్లిక్ అకౌంట్స్ కమిటీలు ఎంతోకాలంగా చర్చించడమే లేదు!

సెక్యూరిటీల కుంభకోణం

పెద్ద సెక్యూరిటీల వ్యాపారి హర్షద్ మెహతా సెక్యూరిటీల కుంభకోణానికి పాల్పడ్డాడు. సెక్యూరిటీలు చూపి బ్యాంకుల నుండి భారీ మొత్తాల్లో రుణాలు పొందాడు. చూపిన సెక్యూరిటీలన్నీ మోసమే అని తేలింది. ఈ ఉదంతంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. అతడు మరణించడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడం జరగలేదు.

టెలికాం కుంభకోణం

అప్పటి కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల మంత్రి సుఖ్‌రాం జోక్యంతో టెలికాం కుంభకోణం జరిగింది. ఆయన సిఫార్సు మేరకు గడువు తీరిన కాంట్రాక్టును ఒక ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టారు. ధరలు నిర్ణయించే కమిటీ సిఫారసులకు విరుద్ధంగా అధికధరలు చెల్లించారన్నది ఆరోపణ. సిబిఐ ఢిల్లీలో, హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో దాడులు జరిపింది. బెడ్‌షీట్ల కింద, సంచుల్లోనూ, సూట్‌కేసుల్లోనూ కోట్లాది నోట్లకట్టలు బయటపడ్డాయి. కేసు నమోదుచేయడంతో ఆయనకు మూడేళ్ళ జైలుశిక్ష పడింది. అప్పీలు చేసుకుంటాననడంతో శిక్ష అమలు నిలిచిపోయింది. ఈ అధ్యాయానికి ముగింపు ఎవరూ ఊహించలేరు.

జిరాక్స్ కుంభకోణం

ఫోటో కాపీయింగ్ మెషీన్లు, ఇతర సామాగ్రి అమ్ముకోవడం కోసం ఒక ప్రముఖ జిరాక్స్ కంపెనీ ప్రభుత్వ అధికారులకు కోట్లాది రూపాయల ముడుపులు చెల్లించిందన్న ఆరోపణలు వచ్చాయి. ముడుపులు చెల్లించిన స్థానిక అధికారుల్ని తొలగించామని ఆ కంపెనీ తర్వాత ప్రకటించింది. ఈ బహుళ జాతి సంస్థతో పాటు మరికొన్ని విదేశీ కంపెనీల పేర్లు కూడా ఈ ఉదంతంలో వెల్లడయ్యాయి. తమ అమ్మకాలు పెంచుకోవడం కోసం ఈ సంస్థలు భారీ మొత్తాల్లో అధికారులకు ముడుపులు చెల్లించాయన్నది ఆరోపణ.

ప్రముఖ ఎన్‌రాన్ సంస్థ బండారం కూడా బద్దలయ్యింది. అమెరికాకి చెందిన ఈ సంస్థ క్లియరెన్స్‌లు- గ్యారంటీలు పొందేందుకు భారీ మొత్తాలు చెల్లించిందన్న ఆరోపణలు వచ్చాయి. ప్రముఖ టెలికాం సంస్థ 'వరల్డ్ కామ్' దాదాపు 500కోట్ల రూపాయల భారీరుణాల వివరాలను తొక్కిబట్టిందన్న ఆరోపణలు ఎదుర్కొంది.

స్టాంపు పేపర్ల కుంభకోణం

రిజిస్ట్రేషన్ల కోసం వినియోగించే స్టాంపు పేపర్ల స్థానంలో నకిలీ పత్రాలు చోటుచేసుకొన్న భారీ కుంభకోణం దేశం మొత్తం మీద అనేక రాష్ట్రాలలో సాగిపోతోంది. 32,000కోట్ల రూపాయలకు పైగా నకిలీ పేపర్లను ముద్రించి అమ్మారని అంచనా! ఈ నకిలీ స్టాంపు పేపర్లు ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లు అమ్మివేసిన యంత్రాలపైనే ముద్రితమవడం వల్ల, ఏది అసలో, ఏది నకిలీయో ఆయా ప్రెస్సుల నిపుణులు కూడా తేల్చలేకపోతున్నారు.

స్కాలర్‌షిప్‌ల కుంభకోణం

షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌గా అందించేందుకు కేటాయించిన నిధుల్ని దొంగపేర్లతో కాజేశారు. 19కోట్ల రూపాయలు ఇలా మాయమయ్యాయని చెబుతున్నప్పటికీ ఆ మొత్తం ఆవగింజలో నగభాగం మాత్రమే కావచ్చునని భావిస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ, పే అండ్ అకౌంట్స్ సిబ్బందితో కుమ్మక్కు అవ్వడం వల్ల ఈ వ్యవహారం సాగిపోయింది. ఈ కుంభకోణంతో ప్రమేయం ఉన్నవారు రాజభవనాల్లాంటి ఇళ్ళు కట్టుకున్నారు. భారీ బ్యాంక్ అకౌంట్లు, విలాసవంతమైన కార్లు, స్థలాలు కొన్నారు. ఒక అకాశరామన్న ఉత్తరం ద్వారా ఈ డొంక అంతా కదిలింది. ఈ అవినీతి దాదాపు 8 సంవత్సరాలుగా సాగుతున్నా ఇటీవలే బయటపడింది. అర్హత గల విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఎందుకు అందడం లేదని ఆరాతీసేందుకు ఏ ఒక్కరూ సిద్ధం కాలేదు.

పబ్లిక్ సర్వీస్ కుంభకోణం

పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ప్రభుత్వోద్యోగాలకు నియామకాలు జరిపే ప్రక్రియను ప్రతిఒక్కరూ విశ్వసిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలను 'యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్', చేపడుతుంది. ప్రతిరాష్ట్రం తమకు అవసరమైన సబ్ జడ్జిలు, మెజిస్ట్రేట్‌లు, పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్లు, రెవిన్యూ-ప్రజా పనుల శాఖల్లో అధికారుల పోస్టుల భర్తీ చేయడానికి స్వంత-పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటుచేసుకున్నది. ఇటీవల పంజాబ్‌లో వెల్లడయిన ఉద్యోగాల భర్తీ కుంభకోణం వల్ల మొత్తం ఈ వ్యవస్థపైనే ప్రజల విశ్వాసం సడలిపోయింది.

పంజాబ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మనే స్వయంగా అవినీతికి పాల్పడటం దేశాన్ని దిగ్భ్రమలో ముంచింది. లంచాలు ఇచ్చిన అభ్యర్థులకు అధిక మార్కులు వేయమని ఛైర్మనే ఎగ్జామినర్లను కోరాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన 639మంది ఉద్యోగుల్ని తొలగించారు. ఛైర్మన్ బాధ్యత తీసుకున్న తర్వాత జరిపిన 3644 నియామకాలనూ సమీక్షించాలని

ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాంకుల సేఫ్టీలాకర్లలో, ఇతర స్థలాలలో బయటపడ్డ నోట్లకట్టలు టివిల్లో ప్రదర్శితమయ్యాయి. జవాబు పత్రాల్లో తారుమారు చేసిన మార్కుల్లో టివిల్లో దర్శనమిచ్చాయి. హైకోర్టు జడ్జీలు కూడా తమవారిని సబ్‌జడ్జిలుగా, మెజిస్ట్రేట్లుగా నియమించుకోవడానికి లంచాలు ఇచ్చి మార్కులు వేయించుకున్నారని తేలింది. మహారాష్ట్రలో కూడా ఇలాంటి కుంభకోణమే బయటపడింది. ముంబాయి యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ అయిన వ్యక్తే- పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ అయ్యారు. సోదా కోసం ఆయన నివాసం సీలువేశారు. ఉద్యోగాల కోసం అభ్యర్థులు కోట్ల రూపాయలు చెల్లించారని విచారణలో తేలింది. 396 జవాబుపత్రాలు దొంగవని తేలింది. అసలు జవాబు పత్రాలను తొలగించి వీటిని ప్రవేశపెట్టారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్లో నలుగుర్ని అరెస్టుచేశారు. అర్హత గల అభ్యర్థులు కొందరు చేసిన ఫిర్యాదుతో ఈ కుంభకోణం బద్దలయ్యింది.

ఎన్.పి.ఎల కుంభకోణం

యాభైవేల కోట్ల రూపాయలకు పైగా బ్యాంకుల్లో కొన్ని సంవత్సరాల తరబడి గల్లంతయిన కుంభకోణం వెల్లడయ్యింది. పారిశ్రామికులకు, వ్యాపారులకు ప్రైవేటు, ప్రభుత్వరంగాల బ్యాంకులు విచక్షణారహితంగా రుణాలు, అడ్వాన్సులు మంజూరు చేశాయి. ఇలా ఇచ్చిన మొత్తాలన్నీ రాని బాకీలుగా తేలాయి. వీటికి 'అనిర్వర్తన ఆస్తులు' అన్న పేరుపెట్టి ఇంకా ఆస్తులుగానే చూపే ప్రయత్నం జరిగింది. ఇవన్నీ వసూలు కానివే అని తేలాయి. ఇలాంటి ఆస్థుల విలువ 43.57కోట్ల రూపాయలని అధికారికంగా వెల్లడించారు. వీటికి వడ్డీలు కూడా కలుపుకుంటే విలువ రెట్టింపు అవుతుంది. ఈ అసాధారణ కుంభకోణానికి కారణం 1980నాటి కేంద్ర ప్రభుత్వ విధానమే. బలహీన వర్గాల వారిని ప్రాధాన్యతా వర్గాలుగా గుర్తిస్తూ- బ్యాంకుల ద్వారా రుణాలు అడ్వాన్సులు ఇచ్చే వెసులుబాటు కల్పించారు. ప్రస్తుతం 3348 సంస్థలు ఒక్కొక్కటి 10కోట్ల రూపాయల దాకా బకాయిలు పడ్డట్టు నిరూపించే పత్రాలు దక్కించుకోగలిగారు.

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల కుంభకోణం

తమ యావజ్జీవిత పొదుపు మొత్తాలను అత్యాసకుపోయి పెట్టుబడులుగా పెట్టే వారిని మోసగించిన అనేక నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు డిపాజిట్లు సేకరించిన తక్షణం మూతపడుతున్నాయి. గత కొద్ది సంవత్సరాలలో 30వేల ఫైనాన్స్ సంస్థలు పుట్టుకొచ్చాయి. అత్యధిక ప్రయోజనాలు ఆశచూపి ఈ సంస్థలు ఖాతాదార్లను ఆకట్టుకొన్నాయి.

ఇలాంటి సంస్థల రిజిస్ట్రేషన్‌కు ప్రస్తుతం రిజర్వ్‌బ్యాంకు అనేక నియమ నిబంధనలను అమలుపరుస్తోంది. అయినా ఇప్పటికే జరగవలసినదంతా జరిగిపోయింది.

పెట్రోలు పంపుల కుంభకోణం

దేశంలోని వివిధ ప్రాంతాలతో అనేక పెట్రోలు పంపుల్ని సంబంధిత అధికారుల- కేంద్రంలో అధికార పార్టీ నాయకుల బంధువులకు కేటాయించారన్న ఆరోపణలు పార్లమెంట్ సమావేశాలని కుదిపివేశాయి. కేటాయింపుల్లో పాటించవలసిన నిబంధనల్ని అతిక్రమించారు. కేటాయింపుల కమిటీల్లో ఆరోపణ నెదుర్కొన్న వారిని నియమించడం ద్వారా అది సాధ్యమయ్యింది. కేటాయింపులు పొందినవారికి రాజకీయ నాయకులతో గల బంధుత్వాలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 3,805 పెట్రోలు పంపుల్లో దాదాపు సగం అధికార పార్టీ నేతల బంధువుల పరమే అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. ప్రతి అక్రమ కేటాయింపుకీ రూ.20 నుండి 30లక్షల వసూళ్లు జరిగాయని భావిస్తున్నారు.

పెట్రోలుపంపుల కేటాయింపులన్నింటని రద్దుచేసి వాటిని వేలానికి పెట్టమని ప్రధానమంత్రి ఆదేశించారు. కొన్ని రాష్ట్రాలలో కేటాయింపులు పొందిన వారు హైకోర్టులను ఆశ్రయించారు. ఇవి సుప్రీంకోర్టుకు కూడా చేరుకోవచ్చు. గతంలో ఇలాంటి సందర్భం ఎదురైనప్పుడు కేటాయింపుల విషయంలో బాధ్యత వహించవలసిన కేంద్రమంత్రికి సుప్రీంకోర్టు రూ.50లక్షల జరిమానా విధించింది. అయితే మరో బెంచికి అప్పీలు చేసుకోవడంతో జరిమానాను రద్దుచేసినా- ఆయన జరిపిన కేటాయింపులు 'దుర్మార్గం' అని పేర్కొన్నది.

ఫైనాన్షియల్ కార్పొరేషన్ కుంభకోణం

హర్యానా ఫైనాన్షియల్ కార్పొరేషన్ 1994-96కాలంలో అడ్వాన్సులు మంజూరు చెయ్యడంలో, చెల్లించడంలో 97కోట్ల రూపాయలు గల్లంతయ్యాయి. నకిలీ డాక్యుమెంట్లు స్వీకరించి, తగిన తనిఖీలు జరపకుండానే భారీ మొత్తాలు విడుదలచేశారు. ఆ మొత్తాలను కూడా వాయిదాలుగా కాకుండా ఒకేసారి విడుదల చేశారు.

ఒక సీనియర్ ఐఎఎస్ అధికారితో బాటు అరడజనుమంది జిల్లా కార్పొరేషన్ల మేనేజర్లుపై అ కుంభకోణానికి సంబంధించిన కేసులు పెట్టారు. ○

1999 ఎన్నికలకు ముందు తెలుగుదేశంపై బిజెపి ఛార్జిషీటు

(దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన తిరుగుబాటు తెలుగుదేశం వంచన, వైఫల్యాలపై బిజెపి ప్రజాకోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్‌ను "ఉదయకమలం" జనవరి 1998 సంచికలో ప్రకటించింది. ఒక్కో ఆరోపణకు ఆ పత్రిక పెట్టిన హెడ్డింగ్‌లను మాత్రమే ఈ కింద పొందుపరుస్తున్నాం. - సంపాదకుడు)

"నమ్మకద్రోహుల నగ్నస్వరూపం"

రాష్ట్రంలో దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన తిరుగుబాటు తెలుగుదేశం నమ్మకద్రోహానికి పాల్పడింది. ప్రజలను వంచించి, అన్ని రంగాల్లో వైఫల్యం చెందింది. కోట్లాది రూపాయలు కుమ్మరించి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టి మరల్చేందుకు, ఏమి చేయకపోయినా చేస్తున్నట్టుగా ప్రజలను భ్రమింపచేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రచార పటాటోపంతో, వంచాన నైపుణ్యంతో నానాపాట్లు పడుతున్నది. హైటెక్ ప్రచారం - లోటెక్ పనితీరు ఈ ప్రభుత్వం మారుపేరుగా నిలిచిపోయింది. "ప్రచారంలో ఫస్ట్ - పనితీరుల్లో లాస్ట్" దీని హైలైట్. పేర్లు మార్చి కొత్త కార్యక్రమాల పేరిట ఆర్భాట ప్రకటన, బడ్జెట్ నిధులు మళింపు, ఆకస్మిక తనిఖీలు, దూరదర్శన్, రేడియోలలో ముఖాముఖి, పత్రికల్లో ఫుల్‌పేజి ప్రకటనలు, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నెలకొక కొత్త కార్యక్రమాన్ని ప్రకటించడం, ఆర్భాటంగా ప్రారంభించడం, హెచ్చుస్థాయిలో ప్రచారం చేయడం, ప్రజలలో ఆశలు కల్పించడం, ఈలోగా మరొక కార్యక్రమానికి రూపకల్పన, వైఫల్యాలతో మరొక కార్యక్రమంవైపు దృష్టి మల్లించడం, పనిచేసేందుకు లేకపోతే ఆకస్మిక తనిఖీల ద్వారా ప్రచారం, కార్యక్రమాల వైఫల్యానికి అధికారులపై ఆగ్రహం ప్రకటించడం, హెలికాప్టర్‌లో విస్తృతంగా పర్యటించడం, ఇక్కడ వార్తలకు అవకాశం లకపోతే ఢిల్లీ వెళ్ళి జాతీయ రాజకీయాలలో సంచలన ప్రకటనలు చేయడం, ఏమి చేయకపోయినా, చేస్తున్నట్టుగా ప్రజాసమస్యలపై ఆరాటపడుతున్నట్టుగా నటించడం ఈ ప్రభుత్వ విధానం అయిపోయింది.

దోపిడీలు దొంగతనాలు, హత్యలు, మానభంగాలకు హద్దే లేదు. కె.జి. నుండి పి.జి. వరకు పరీక్షా పత్రాల లీకేజి, పరిశ్రమల మూసివేత, అమ్మకం, ప్రజలపై పన్నుల భారం, ప్రపంచ బ్యాంకు చెప్పినట్టుగా నడుచుకోవడం ఈ ప్రభుత్వం యొక్క విధానం అయిపోయింది. రైతులకు గిట్టుబాటు ధర లేదు. కరెంటు కోత భయంకరంగా వున్నది. అక్రమ మద్యం అధికార పార్టీ వారికి వరమైపోయింది. అభివృద్ధి కుంటుపడింది. పేదప్రజలపై భారం ఎక్కువ అయింది. రికార్డు స్థాయిలో పన్నులు విధించినా కనీస వస్తువులకు దిక్కు లేదు. అవినీతి విచ్చలవిడి అయిపోయింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఘోరంగా తయారయ్యింది. ప్రజాసమస్యలను పట్టించుకునే నాథుడే లేదు. జిమ్మిక్కులతో పరిపాలన చేయాలనుకోవడంతో క్రింది స్థాయి ప్రజల సమస్యలను గాలికి వదిలివేశారు. సర్వత్రా వైఫల్యానికి సంబరాలు ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం తన హైటెక్ తెలివితో తనకు అనుకూలంగా ఉన్న వందిమాగద ప్రచార సాధనాల సౌజన్యంతో ప్రజల దృష్టి మళ్లించడమే ఏకసూత్ర కార్యక్రమంగా పెట్టుకుని నడుస్తున్నది.

ఈ ప్రభుత్వంపై అన్ని వర్గాల అసంతృప్తి పెరుగుతున్నది. దీని నిజస్వరూపాన్ని బట్టబయలు చేసేందుకు, ప్రజలలో ఆరోగ్యకరమైన రాజకీయ చర్చను లేవనెత్తేందుకు, ఒక నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా భారతీయ జనతాపార్టీ ఈ ప్రభుత్వం యొక్క నమ్మకద్రోహాన్ని, వైఫల్యాలను వీరు చెప్పినదేమిటి, చేస్తున్నదేమిటి సవివరంగా ప్రజల ముందు పెట్టదలచుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం తన ఎన్నికల ప్రణాళికలో ఏ వాగ్దానాలు చేసింది. ఏ విధంగా నమ్మకద్రోహానికి పాల్పడి, వాగ్దాన భంగం చేసింది సవివరంగా తెలియజేసేందుకు భారతీయ జనతాపార్టీ ఈ చార్జిషీటును మీ ముందుంచుతున్నది.

1. అవినీతి కాంగ్రెస్‌తో మిలాఖత్
2. రెండు రూపాయలకు కిలోబియ్యం పథకానికి తూట్లు
3. మద్యపానంపై మహాద్రోహం
4. పంటకు - ఇంటికి విద్యుత్ చార్జీల భారీవడ్డన
5. అర్హులందరికీ రేషన్ కార్డులు : ఊదగొడుతున్నారు.
6. గృహనిర్మాణంలో పక్షపాతం - నమ్మకద్రోహం
7. విద్యుచ్ఛక్తి - చీకటి రాజ్యం
8. మాటల్లో మంచినీరు
9. ధరల అదుపుపై రాష్ట్రస్థాయి కమిటి-అదే సమయంలో ధరల పెంపు
10. పెండింగ్ ఫైళ్ళ ప్రహసనం
11. ఓట్లకు ముందు కోట్లే ఓట్లు - ఓట్ల తరువాత తూట్లే ఓట్లు
12. నిరుద్యోగులకు పంగనామాలు
13. మహిళలకూ మొండి చెయ్యే
14. మైనారిటీలకు ఎన్నికల ముందు వరాలు - తరువాత మొండి చెయ్యే

అన్నీ హామీలే

15. కూలీలకు...
16. రైతులకు...
17. పేదలకూ....
18. దళితులకూ....
19. పత్రికలకు సైతం...
20. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో ఘోర వైఫల్యం

21. నీటిపారుదలపై నిర్లక్ష్యం
22. 1996 తుఫాను సహాయంలో రైతులకు మొండిచెయ్యి
23. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జల్లాలలో 1996 వరద సహాయంలో వైఫల్యం
24. కరువులో పంటపోయిన రైతుకు చేయగలిగింది ఏమీ లేదు.
25. వంటల భీమా పథకం: తగుచర్యలు తీసుకోలేని ముఖ్యమంత్రి
26. అల్మట్టిపై రాజీ - రాష్ట్రానికి తీరని అన్యాయం
27. కుంటుపడిన పారిశ్రామిక ప్రగతి
28. పరిశ్రమల మూత - కార్మికుల కడుపుకోత
29. గీతకార్మికులపై భారం
30. గొప్పలు చెప్పుకొని నష్టపోయిన రాష్ట్రం
31. మాటలు హైటెక్ - ఆచరణ లోటెక్
32. అవినీతిపై రాజీ

అన్నింటా అవినీతి

33. ఏలేరు భూసేకరణ - నష్టపరిహారం చెల్లింపు కుంభకోణం
34. విశాఖ పోర్టు భూముల కుంభకోణం
35. పారదర్శకత్వం లేని విద్యుత్ ఒప్పందాలు
36. తుఫాన్ బియ్యం అక్రమ నిల్వలు
37. గృహనిర్మాణంలో కుంభకోణం
38. ఎల్ అండ్ టి ఇన్ఫోసిటీ ఒప్పందం - అతిచవగ్గా భూమి కేటాయింపు
39. బేగంపేట భూమి - హెరిటేజ్ డైరెక్టర్ కొనుగోలు
40. బంజారాహిల్స్ భూమి కుంభకోణం
41. జిల్లా పరిషత్ ఛైర్మన్ల అవినీతి
42. బెదిరింపులతో కాంట్రాక్టులు
43. జన్మభూమిపేరుతో కాంట్రాక్టర్లకు అత్యధిక ఎస్టిమేట్లు
44. మధ్యనిషేధం మహామంచి వ్యాపారం
45. ఫలితంలేని ప్రజల వద్దకు పాలన
46. హెలికాప్టర్ ముఖ్యమంత్రి
47. రైతాంగంపై చిన్నచూపు - రైతు వ్యతిరేక ధోరణి
48. నిధుల తగ్గింపు కేటాయించిన వాటిని ఖర్చుపెట్టడంలో నిర్లక్ష్యం
49. గిట్టుబాటు ధరలు లేవు
50. అన్నదాతల ఆత్మహత్యలు
51. అన్నదాతపై లాఠీచార్జి
52. అన్నదాతలపై కాల్పులు
53. నీటితీరువా పెంపు - రైతులపై పెనుభారం
54. రవాణా ఆంక్షలు
55. బకాయిల చెల్లింపులో జాప్యం
56. మార్కెట్ సెస్సు మళ్ళింపు
57. కల్తీ ఎరువులు
58. నిరుపయోగమైన కర్షక సదస్సులు
59. అశాంతి నిలయంలో విశ్వవిద్యాలయాలు
60. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం - పరీక్షల నిర్వహణలో ఘోర వైఫల్యం
61. ర్యాంకుల తారుమారు
62. పరీక్షా పేపర్ల గల్లంతు
63. మాస్ కాపీయింగ్ - రద్దయిన పరీక్షలు
64. 97, మెడికల్ అడ్మిషన్స్ రదు&
65. పరీక్ష రాయకపోయినా ర్యాంక్
66. సరఫరా మరిచిపోయిన పుస్తకాలు
67. భర్తీకాని టీచర్ల పోస్టులు
68. హైటెక్ ప్రభుత్వంలో ఆర్థిక క్రమశిక్షణ కరవు
69. అప్పుల ఊబిలో ఆంధ్ర
70. ఛార్జీల పెంపు - పన్నుల పెంపులో ఫస్ట్
71. భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలు కొండపైకి
72. ప్రణాళికా కేటాయింపుల్లో కోత
73. ఎన్నికలకు ఎగనామం
74. సి.యం.ఇ.వై.: ప్రచారంలో శ్రద్ధ, అమలులో నిద్ర
75. అధికారులే లేరు - ఇక పరిపాలన ఎక్కడ
76. ప్రభుత్వ ప్రచార సాధనాల దుర్వినియోగం - ప్రజాధనం ప్రచారం పాలు
77. రాష్ట్రంలో శాంతికి సెలవు - భద్రతకు కరవు
78. నక్సలైట్ల పోటీ పరిపాలన
79. తీవ్రవాదుల హింసాకాండ
80. నక్సలైట్లపై ప్రభుత్వ ఉదాసీనత
81. మహిళలపై అత్యాచారాలు
82. తెలుగుదేశం నాయకుల నిర్వాకం
83. రైలు దోపిడీలు
84. బస్సు దోపిడీలు, దొంగతనాలు
85. రాజధానిలో ఐ.ఎస్.ఐ. కార్యకలాపాలు
86. హత్యలు, దాడులు
87. పోలీసులకే దిక్కులేకపోతే ప్రజలకు దిక్కెవ్వరు?
88. బలహీన వర్గాలపై దాడులు
89. గిరిజనులు గిరిజనేతరులు మధ్య చిచ్చు
90. నష్టాల్లో కార్పొరేషన్లు - మరొక వంక పదవుల పందేరం
91. నిరుద్యోగుల్లో నిస్పృహ
92. విందు, మందు, పొందు - ఇదీ ఎం.ఎల్.ఎ క్వార్టర్స్
93. రాష్ట్రాల అధికారంపై ఆరాటం, కాని స్థానిక సమస్యలకు మొండి చెయ్యి
94. ఆంధ్రాను రోజుకొక దేశంగా మార్చివేస్తారట
95. ప్రపంచ బ్యాంకు సూపర్‌డైరెక్షన్
96. ప్రపంచ బ్యాంకు అప్పు ఇస్తుందని పక్కా ఇళ్ళ కూల్చివేత
97. హైటెక్ ప్రచారం - లోటెక్ పని విధానం
98. విద్యార్థులపై లాఠిచార్జి కాల్పులు
99. ఎన్.టి.ఆర్ మా నాయకుడు - ఆయనే మా దైవం - అయినా దించేసాం
100. ఇంకా విచిత్రం - విజయవాడ ఉదంతం

మధ్యంతర ఆర్థిక నివేదికా? ఎన్నికల ప్రణాళికా?

- వై. నారాయణమూర్తి

ఎన్నికల గాలి మధ్యంతర ఆర్థిక నివేదికకు కూడా తగిలింది. ఎన్నికల సమయంలో ప్రభుత్వాలు తాము అద్భుతాలు సాధించినట్లు చెప్పుకొన్నట్లే, మధ్యంతర నివేదికలో కూడా ఆర్థిక వ్యవస్థ పుంజుకొన్నదని ఏడు శాతం పైగా స్థూల జాతీయాదాయం పెరగబోతుందని ఊరిస్తున్నారు. ఎగుమతులు పెరుగుతున్నాయట. ఆహారధాన్యాల ఉత్పత్తి పెరగబోతుందట. ద్రవ్యోల్బణం అదుపులో ఉందట. ప్రజల్ని తాడిచెట్టెక్కించేస్తున్నారు. రాష్ట్రంలో చంద్రబాబు తానే నెంబర్‌వన్ అని అంటున్నట్లు, అక్కడ కేంద్రంలో కూడా అంతా బాగానే వున్నట్లు నమ్మబలుకుతున్నారు. అవును మరి, ఎన్నికలొస్తున్నాయి కాబట్టి వైఫల్యాల దారిలో నీటి చలమలు వున్నట్లే కనిపిస్తాయి. అధికారాంతంబునందున్నట్లు, ఎన్నికల అనంతరం వాళ్లు తుపాకి దెబ్బకు కూడా కనపడరు. మనమంతా ఏరుదాటిన తర్వాత బోడిమల్లయ్యలమే అవుతాం. అంతవరకూ ఎందుకు? పాలకులు చెబుతున్న వాటిలో నేతి బీరకాయలో నెయ్యి వున్నట్లేనా కాదా అని చూద్దాం. అలా చూడబోతున్నప్పుడు ఆర్థికవేత్తల పరిభాషలో కాకుండా సామాన్యుని జీవనం అనే గీటురాయి మీద ప్రభుత్వ వాగ్దానాలు, ఆచరణ అనే వాటిని గీసి, అందులో ఎంత వాస్తవం ఉందో తెలుసుకొందాం.

దేశం అంతా గత సంవత్సరంలో ఇటీవలి కాలంలో కనీవినీ ఎరుగనంత కరవు పరిస్థితులు చుట్టేశాయి. ఆహారధాన్యాలలో పంట బాగా తగ్గింది. అలా తగ్గిన వాస్తవంతో పోలిస్తే, నడుస్తున్న సంవత్సరంలో దేశం మొత్తంమీద వర్షాలు ఆశాజనకంగా వున్నాయి కాబట్టి, పెరుగుదల అంచనాలు బాగానే కనిపిస్తాయి. కొంతమేరకు బావుంటాయనే వాస్తవాన్ని కాదనలేం. అయితే ఇప్పటికి ఖరీఫ్ మాత్రమే చూశాం. ఇంకా రబీ పంట ఎంతుంటుందో ఊహించే స్థాయిలో లేము. అయినా 212మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు పండుతాయంటే నమ్మగలమా? పంట బాగా పండని ఏడాదితో పోలిస్తే పంట మామూలు స్థాయిలో పండినా, బాగా పండిందనే అనుభూతి కలుగుతుంది. అటువంటి అంచనాల ఆధారంగా ఆర్థికవ్యవస్థ పుంజుకొందని అనటం అతిగా స్పందించడమే అవుతుంది. ఉత్పత్తి పెరుగుదల తరుగుదలలో సామాన్యునికి సంబంధం లేదు. ఎందుచేతనంటే ఉత్పత్తి ఇబ్బడి ముబ్బడిగా వున్నప్పుడు రెండు పూటలా తిన్నాడా? లేదు. జనాభాలో నాలుగో వంతు తిండి గింజలకు మొఖం వాచివుంటే ఆర్థిక పరిస్థితి బాగవుతుందని చంకలు గుద్దుకొనే ప్రభుత్వం ప్రభుత్వమేనా?

సంవత్సరానికి కోటి ఉద్యోగాలిస్తామని అందలం ఎక్కిన బి.జె.పి ప్రభుత్వం ఎంత మందికి ఉపాధి కల్పించింది?. వ్యవసాయం ఉపాధి కల్పించటం లేదు. ప్రత్యేకంగా ఉపాధి కల్పించే పథకాలు లక్ష్యాలను చేరుకోవటంలో విఫలమవుతున్నాయి. ఇటీవల ఫిక్కి సంస్థ ఒక సర్వే జరిపితే పారిశ్రామికవేత్తలు ఉద్యోగావకాశాలు కల్పించటం కన్నా యంత్రాలను వినియోగించడంపైనే ఎక్కువ ఆసక్తి చూపించారని తేలింది. ఖాయిలాపడుతున్న పరిశ్రమలు, ముఖ్యంగా చిన్న పరిశ్రమలు మూతపడి కార్మికులు వీధిన పడుతున్నారు. సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత విఆర్‌ఎస్ పేరుతో గాని, తొలగింపువలన కాని కార్మికుల సంఖ్య తగ్గుతూంది. నిరుద్యోగం పెరుగుతోంది. ఇది చాలదన్నట్లు కార్మిక చట్టాలను సవరించి, యజమానులకు నోటీసులేకుండా కార్మికులను నియమించే, తొలగించే హక్కును కల్పిస్తుంది. పర్మనెంటు ఉద్యోగాల స్థానే కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థ ఇప్పటికే అమల్లోకి వచ్చింది. కోటి ఉద్యోగాల గురించి చిగురింపచేసిన ఆశలు నిరాశలవుతున్నాయి. దేశమంతా రెండుసార్లు లెక్కవేసినా 50లక్షల మందికి కూడా ఈ రంగం ఉద్యోగవసతి కల్పించలేక పోయింది. నిరుద్యోగం ఒక పక్క నక్సలిజానికి, రెండోపక్క అసాంఘిక శక్తుల విజృంభణకు దారితీసింది. ఉద్యోగవసతి కల్పించలేని అభివృద్ధి అభివృద్ధేనా? ఆర్థికపరిస్థితి మెరుగవుతుందంటే అది మరిన్ని పరిశ్రమల స్థాపనకు దారితీస్తుందా?

తినడానికి తిండి లేకపోతే మానె, తాగడానికి పరిశుభ్రమైన మంచినీటికి కూడా దేశప్రజలంతా నోచుకోలేదు. మొన్న కరవు

పరిస్థితి ఏర్పడినప్పుడు దేశంలో ప్రత్యేకంగా మన రాష్ట్రంలో తాగునీటికి కూడా కటకటలాడిపోయిన సంగతి ఇటీవలి అనుభవం. తాగునీరు లభించక పోవటం వల్లనే, అపరిశుభ్రమైన నీరు తాగి విరోచనాలతో అనేకమంది పిల్లలు మరణించటం జరుగుతుంది. ఆరోగ్యమే మహాభాగ్యం అని పిల్లలు పాఠ్యపుస్తకాల్లో చదువుకోవడమే గాని, అనుభవంలో కాదు. దేశంలో ఆరోగ్య చిత్రం ఎలా వుందో ప్రణాళికా సంఘం 2002లో ప్రచురించిన మానవాభివృద్ధి నివేదిక తెలియచేస్తుంది. డాక్టర్లు, పారామెడికల్ మానవ వనరుల కొరత, మౌలిక సౌకర్యాల లేమి, దారిద్ర్యం వల్ల ఒకేసారి అనేక రోగాల బారిన పడడం, ప్రయివేటు వైద్యం మీద ఎక్కువగా ఆధారపడాల్సి రావటం, పెరుగుతున్న వైద్యం ఖరీదు, మెజారిటీ ప్రజలకు అందుబాటులో లేని ఆధునిక సాంకేతిక వైద్యం, మంచినీరు, పారిశుధ్యం కొరత– ఈ పట్టిక చేంతాడంత సాడవునా వుంది. మచ్చుకుకొన్ని ప్రాథమిక రంగాలను తీసుకొని పరిశీలిస్తే సామాన్యుడు ఇంతదూరాన వుంటే ఆర్థికపరిస్థితి బావుంటే నేమి, బాగోకపోతే నేమి ఎవరిక్కావాలి? ఇక ఆర్థికవేత్తల వాదనలు చూద్దాం.

కరవు కుదిపేసిన గత సంవత్సరంతో పోలిస్తే, ఈ సంవత్సరం ఖరీఫ్ పంట మెరుగేనన్నది వాస్తవం. పరిస్థితి మెరుగు పడిందంటే అది ప్రభుత్వ విధానాల వల్లనే అనేది అవాస్తవం. అది రుతుపవనాల పుణ్యం. ఇది మొదటి విషయం. వ్యవసాయం పరిస్థితి మెరుగైంది కాని దాని ఫలితాలు ఆర్థికజీవనం మీద ప్రభావం పడడానికి కొంత సమయం పడుతుంది. తెల్లారేసరికి రైతులు బాగుపడిపోరు, వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది, పారిశ్రామికోత్పత్తులకు గిరాకీ ఏర్పడి, పరిశ్రమలు బాగుపడిపోతాయనుకోవటం ఊహల్లోనే; వాస్తవంలో కాదు. ఇది రెండో విషయం. పరిశ్రమల పరిస్థితి కాస్తమెరుగైంది వాస్తవమే. కాని వాటి ఆదాయ వ్యయ పరిస్థితి లాభాలు చూపిస్తున్నాయంటే దానికి బాంకు వడ్డీల తగ్గింపు, కార్మికుల తొలగింపు ద్వారా ఉత్పత్తి ఖర్చులు తగ్గించటం వల్లనే కాని ఆర్థికపరిస్థితిని ప్రభుత్వం సరిగ్గా మానేజ్ చేయటం వల్ల కాదు. ఇది మూడో విషయం. షేర్ మార్కెట్‌లో బూమ్ చూసి ఆర్థికంగా దేశం ఆరోగ్యం కోలుకుంటుందని అనుకోవటం మనలను మనం మోసం చేసుకోవటమే సెన్సెక్స్ 5000 స్థాయి దాటడం కూడా ఆ కోవలోనిదే. పెరిగిందంటే విదేశీ పెట్టుబడులు స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించడమే. ఆర్థికపరిస్థితి ఆశాజనకంగా మారటం వల్ల కాదు. ఒక వేళ ఆర్థికపరిస్థితి బాగుపడడం వల్లనే స్టాక్‌మార్కెట్ కళకళ లాడుతుందని అనుకొన్నా, దానివల్ల లాభపడేది వేళ్లమీదే లెక్కపెట్టగలిగిన వారికి మాత్రమే. ఇది నాలుగో విషయం. విదేశీమారకం నిల్వలు మస్తుగా వున్నాయి. కాబట్టి ఏమీ ఫర్వాలేదని, ఆర్థికంగా భేఫర్వా అంటున్నారు పాలకులు. కాని వాస్తవం ఏమిటంటే ఈ విదేశీ మారకం నిల్వలన్నీ మనం సంపాదించుకొన్నవి కావు. ఇందులో సింహభాగం ఏ నిమిషంలోనైనా బయటకు వెళ్ళిపోవచ్చు. విదేశీమారకం పెరగడానికి మరోకారణం మన బియ్యం నిల్వలను అమ్ముకోవటం వల్లనే. అలాగే స్టేట్‌బ్యాంక్ రిజర్జెంట్ ఇండియా బాండ్స్ వల్ల వచ్చిన ఆదాయం. ఇది వాపేగాని బలుపు కాదు. ఇది అయిదో విషయం. ఆర్థికంగా నమ్మకమైన అభివృద్ధి సాధనకు మౌలిక సౌకర్యాల కల్పన ముఖ్యం. ఈ సౌకర్యాలు ఇంకా ఆమడదూరంలోనే వున్నాయి. ఇది ఆరో విషయం. ఎగుమతులు పెరిగాయి. కాని ఆ పెరుగుదల వేగం గత సంవత్సరంలో సగమే. రెవెన్యూలోటు గత సంవత్సరం పూర్వార్థ కాలంలో కన్నా 37శాతం పెరిగింది. గత సంవత్సరం ఆర్థికపెరుగుదల 4.3శాతం మాత్రమే. ఈ సంవత్సరం ఒక్క ఉదుటున ఏడు శాతానికి ఎలా పెరుగుతుందనేది ప్రశ్నార్థకమైతే, ఒకవేళ అంతమేరకు పెరిగిందనుకొన్నా ప్రతి సంవత్సరం సగటున ఎనిమిది శాతం పెరుగుదల లక్ష్యానికి ఇంకా దూరంలోనే వుంది. అలా పెరిగితే తప్ప పదవ ప్రణాళిక పది శాతం పెరుగుదల లక్ష్యం చేరుకోవటం సాధ్యం కాదు. ఏడు శాతం పెరుగుదల సాధించినా, ఈ సంవత్సరం, గత సంవత్సరం కలుపుకొని చూస్తే పెరుగుదలరేటు 5.5శాతం మాత్రమేనని, గత రెండు దశాబ్దాల్లో ఇదే రేటున పెరిగిందని, కాగా పెద్దగొప్పగా చెప్పుకోవాల్సిందేమీ కాదని ఒక పారిశ్రామిక సమాఖ్య వ్యాఖ్య. ప్రణాళిక మొదటి అర్థ సంవత్సరంలో చేయాల్సిన ఖర్చులో సగం ఖర్చుకావాల్సి వుండగా 38.8శాతం ఖర్చు మాత్రమే జరిగింది. పెట్టుబడి ఖర్చు ద్రవ్యలోటు లక్ష్యాలను మించి ఆందోళన కలిగిస్తుంది.

ఈ లొసుగులన్నిటినీ కప్పిపుచ్చి, మధ్యంతర ఆర్థిక నివేదిక ఆశాజనకంగా ఉందని చిత్రించటం, అది కూడా ఎన్నికల ముందు అలా చిత్రించ పూనుకోవటం చూస్తే, ఇది మధ్యంతర ఆర్థిక నివేదికా, లేక ఎన్నికల ప్రణాళికా అని ప్రశ్నించాల్సి వస్తుంది.

తెలుగుదేశం ఎన్నికల్లో నక్సలైట్ల సమస్యను ప్రధానం చేయటం హక్కుల కోణంలో ఆందోళన కలిగించే అంశం. పోలీసులు విచ్చలవిడి హింసాకాండకు అమోదసూచికగా తీసుకునే ప్రమాదం ఉంది. నక్సలైట్లు రాష్ట్రంలో ప్రధాన రాజకీయ సమస్యని ప్రజలెవ్వరూ భావించడం లేదు.

- మానవ హక్కుల వేదిక

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఐడిపిఎల్‌ను ఉపయోగించుకోవాలి. మూతబడిన ఆ సంస్థను పునరుద్ధరించుకోవాలి. ఫార్మారంగంలో ప్రపంచంలో నెలకొన్న పోటీని ఎదుర్కొనడానికి హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థను ఏర్పాటుచేయాలి.

-ఫార్మారంగ అభివృద్ధి అధ్యయన నిపుణుల కమిటి

ప్రజాప్రతినిధులకు అహంభావం పెరుగుతున్నది. శాసనసభ్యులకు, న్యాయమూర్తులకు ఉండే అధికారాలపై అందరికి ఆమోదయోగ్యమైన నిబంధనావళిని రూపొందించుకోవాలి.

-పొత్తూరి వెంకటేశ్వరరావు (ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్)

రాష్ట్ర వాయిద్య వృత్తి కళాకారులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. రాష్ట్రంలో ఆరు లక్షల మంది ఈ వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్నారు.

-రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘం

ప్రభుత్వ శాఖల్లో కొనసాగుతున్న అలక్ష్యం రోజువారి పరిపాలనకు తీవ్ర ఆటంకాలు కలిగిస్తుంది. రికార్డులు గోరంగా తయారయ్యాయి ఆడిట్ అధ్వాన్నంగా ఉంది.

-ప్రసన్నకుమారి మహంతి (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)

అతిపెద్ద ప్రజాస్వామ్యం, అదిపెద్ద రాజ్యాంగం గల దేశంగా ప్రసిద్ధికెక్కిన భారత్‌లో పత్రికాస్వేచ్ఛ ప్రస్తుతించదగిన స్థాయిలో లేదు. ఈ విషయంలో 166దేశాల్లో జరిపిన సర్వేలో భారత్‌ది 129వ స్థానం.

-ఫ్రాన్స్‌కు చెందిన 'రిపోర్టర్స్ శాన్స్ ఫ్రాంటీయర్స్' నివేదిక

ఆర్థిక అవరోధాలు పేదలకు నాణ్యమైన విద్య అందానికి అవరోధంగా మారాయి. ఇప్పుడు పేదవాని పాఠశాలకు, సంపన్నుని పాఠశాలకు మధ్య అంతరం మరింత స్పష్టంగా కనబడుతుంది.

- అటల్ బిహారి వాజ్‌పేయి

గత 10 సంవత్సరాలుగా భారత్ అనేక సంస్కరణలు అమలు చేసినా ఇతర దేశాలతో పోలిస్తే పోటీ సామర్థ్యాన్ని నామమాత్రంగానే పెంచుకోలిగింది.

-అగస్టోలోపెజ్ కార్లోస్ (ప్రపంచ ఆర్థికవేదిక (డబ్ల్యు.ఇ.ఎఫ్) ఆర్థికవేత్త)

నూతన సరళీకరణ పెట్టుబడిదారీ ప్రపంచంలో రోజురోజుకు ఆటవికత పెరిగిపోతుంది. దీనిని అంతం చేయకుంటే భూగ్రహాన్నే నాశనం చేస్తుంది.

- ఫైడెల్ కాస్ట్రో (క్యూబా అధ్యక్షుడు)

ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేస్తున్నాయన్న అపవాదును తొలగించుకుని ప్రభుత్వరంగ సంస్థలు నెమ్మదిగా లాభాల దిశలో పయనిస్తున్నాయి. మున్ముందు పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించే అవకాశం ఉంది.

- అప్లైడ్ ఎకనిమిక్స్ రిసెర్చ్ జాతీయమండలి (ఎన్‌సిఎఇఆర్)

అన్ని రకాలుగా అభివృద్ధిని సాధించి పేదల జీవితాల్లో వెలుగు తెచ్చినప్పుడే నక్సల్స్ సమస్యకు పరిష్కారం సాధ్యమౌతుంది. కేవలం పోలీసుల ద్వారా ఈ సమస్య కొలిక్కి రానే రాదు.

- మహారాష్ట్ర ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ షిండే

ఈ ఏడాది చివరికల్లా అమెరికాలోని కాల్‌సెంటర్లలో దాదాపు లక్షా 50 వేల ఉద్యోగాలు బయటి దేశాలకు తరలి పోతున్నాయి. 2008 నాటికి ఈ సంఖ్య 2 లక్షలకు దాటిపోతుంది

-డేటా మోనిటర్ సర్వే

దేశంలో 38.5శాతం మంది ఒకే గది ఇళ్లల్లో నివశిస్తున్నారు. 30శాతం మంది రెండు గదుల ఇళ్లల్లో, 14.3శాతం మూడు గదుల ఇళ్లల్లో, 17.2శాతం మంది మూడు ఆ పైన గదులు గల ఇళ్లల్లో నివశిస్తున్నారు.

-ప్రభుత్వ సర్వే.

దేశంలో జరుగుతున్న అభివృద్ధి ఉపాధిరహితవృద్ధి. భారత సమాజంలో నెలకొన్న అశాంతి వలన, సంపాదించిన ఆదాయంలో ఎక్కువ భాగాన్ని శాంతి, భద్రతల నిర్వహణకోసం ఖర్చు చేస్తున్నారు.

-ఎమ్.ఎస్. స్వామినాథన్ (వ్యవసాయ శాస్త్రవేత్త)

కాంగ్రెస్ రాష్ట్ర ఆత్మ గౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టింది - చంద్రబాబు
- ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టిందెవరు ?

'మన మొక సిద్ధాంతం కోసం పని చేస్తున్నాం' - ముఖ్యమంత్రి

- అదేమిటి, మనకు ఏ 'ఇజం లేదు, టూరిజమే మన ఇజం అన్నారు కదా... టూరిజం కోసమే ముందుకు పోతున్నారా?

'అభివృద్ధి ఎజెండాకు కాంగ్రెస్ అడ్డు పడుతోంది' - ముఖ్యమంత్రి

- లేని అభివృద్ధికి కాంగ్రెస్ ఎలా అడ్డుపడుతుంది ?

"కాంగ్రెస్ అధికారం కోసం తహతహలాడుతోంది" - కడియం శ్రీహరి

- మరి తమరో ?

"ప్రజలే ముందస్తు ఎన్నికలు కోరుకుంటున్నారు" - మేయర్ తీగల

- ఒక్క ప్రజా సంస్థ స్టేట్‌మెంటునైనా ఉదహరించగలుగుతారా ?

"మీ మైండ్ ఎపుడూ వై.ఎస్. చుట్టూ వుంటుంది" పాత్రికేయులతో సి.ఎం.

- తమ చుట్టూనే వుండాలా ?

"పొత్తులపై కాంగ్రెస్ వెంపర్లాట" - వెంకయ్య నాయుడు

- 24 పార్టీలతో పొత్తు పెట్టుకొని ప్రభుత్వాన్ని నడిపిస్తున్న పార్టీ నాయకుడేనా ఈ మాట అనేది ?

"కాంగ్రెస్, వామపక్షాలు ఎన్నికల్లో సీట్ల కోసం సర్దుబాటు చేసుకోవటం సిగ్గు చేటు" - బండారు

- గత ఎన్నికల ముందు 100 ఆరోపణలు చేసిన బి.జె.పి. నాయకునికి దేశంతో మమేకం కావటం సిగ్గు చేటు కాదు కాబోలు

"ఎవరితో పొత్తు లేకుండా కాంగ్రెస్‌ను మాతో పోటీ పడమనండి" - కాంగ్రెస్‌కు దేశం ఛాలెంజ్

- బి.జె.పి.తో పొత్తు లేకుండా దేశం పోటీ చేస్తుందా ?

"అధికారమే విపక్షాల పరమావధి" - రావుల

- మీ పరమావధేమిటో ?

"అమాంబాపతు పార్టీలతో జట్టు కలిపే కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీయేనా?" - బి.జె.పి. ప్రధాన కార్యదర్శి జి.కిషన్ రెడ్డి

- 24 పార్టీలతో జట్టు కలిపి తెస్తే గాని ప్రభుత్వాన్నేర్పరచలేకపోయిన బి.జె.పి. జాతీయ పార్టీయా ?

"మరో అవకాశం ఇవ్వండి" గుంటూరు ఎన్నికల సభలో ముఖ్యమంత్రి

- 1999లో అలా ఇచ్చేగా మరిన్ని వేల కోట్ల రుణ భారాన్ని తలకు చుట్టుకొంది.

"మందుపాతరలు రహస్యంగా పెట్టారు" పోలీసు అధికారి

- రహస్యంగా పెట్టకోకపోతే, బొట్టుపెట్టి పేరంటానికి పిలిచినట్లు ఫలానా చోట పెడుతున్నాం అని చెబుతారా ?

"మాస్కో హాస్టల్లో అగ్ని జ్వాలలు" వార్త

- ఉస్మానియా హాస్టల్‌లో ఎబివిపి విద్యార్థుల వద్దకు ట్రెయినింగ్‌కు పంపండి. అగ్గిపుల్ల గీయకుండానే మంటలు పెట్టగల సమర్థులు.

"పెనుగొండ తెలుగుదేశం మాజీ శాసనసభ్యుడు తీవ్రవాదులకు నేరుగా తుపాకులిచ్చినట్లు నివేదికలు ప్రభుత్వానికి అందాయి" - వై.ఎస్.

- నిజమేనా తె.దే. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుగారూ? మరి కాంగ్రెస్ వారే నక్సల్స్ మిత్రులంటున్నారేమిటి ?

"రైల్వే బడ్జెట్‌లో ఛార్జీలు పెంచకపోవచ్చు" ఎకనామిక్ టైమ్స్ వార్త

- పార్లమెంటు ఎన్నికలు రాబోతుండగా ఛార్జీలు పెంచే దమ్ములు ఏ ప్రభుత్వానికుంటాయి ?

"కార్మిక సంస్కరణల వల్ల ఉద్యోగాలు తగ్గవు" - కేంద్రమంత్రి జైట్లీ

- సుదీర్ఘ భవిష్యత్తులో పెరుగుతాయట!

"యూరోముందు చిన్నబోయిన డాలర్" - వార్త

- యూరోముందేమిటి ? రూపాయ ముందే డాలరు చిన్నబోయింది. ఇదివరకు 48 రూపాయలకు ఒక డాలరయితే ఇపుడు 45 రూపాయలకే లభిస్తుంది.

తెలుగుదేశం పతన కారణాలు - 3

ప్రతికూల పవనానికి పునాది ఏమిటి?

- ఎన్.వి.గోపాల్

కులాన్ని రాజకీయాలలోకి బహిరంగంగా తెచ్చినందువల్ల ఈ రాజకీయవాదులు కొంత లాభాన్ని పొందినట్టు కనిపించింది గాని, ఆ పరిణామం సామాజికంగా అనేక దుష్ఫలితాలకు దారితీసింది. తమ తమ కులాల పేర్లు చెప్పుకుని, అయా కులాల వారి సంఘటిత శక్తులుగా తమను తాము అభివర్ధించుకున్నందువల్ల ఈ పార్టీలు ఆయా కులాల ప్రజలలో ఒక రకమైన అభిజాత్యాన్ని, దురహంకారాన్ని రెచ్చగొట్టగలిగాయి. తద్వారా ఆవేశాల మీద రాజకీయాలు నడిపి తమ తమ కులాలలోని ప్రజలను ఆకట్టుకొని బలమైన శక్తిగా కనిపించగలిగాయి. కాని ఆ పరిణామం వల్లనే సమాజంలో నిలువుగాను, అడ్డంగానూ గోడలు స్పష్టమయిపోయాయి. అంతవరకూ తేడాలుగా, భిన్నాభిప్రాయాలుగా ఉన్నవి శత్రుత్వాలుగా మారిపోయాయి. ఏ పార్టీ అయినా బహిరంగంగా తాను ఒక కులానికి చెందినదని భావించుకుంటే తక్కిన కులాలన్నీ ఆ పార్టీని వ్యతిరేకించే స్థితి వచ్చింది.

అటు రాజకీయ, పరిపాలనా విధానాలలో స్పష్టత లేకపోవడంతో పాటు, ఇటు అవినీతి, ఆశ్రిత పక్షపాతం కలగలిసి తెలుగుదేశం ప్రభుత్వం తొలి రోజుల నుంచో లుకలుకలాడడం ప్రారంభమైంది. అయితే 1984 ఆగస్టులో గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రజాస్వామిక బర్తరఫ్ చేయడంతో, ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ఎన్.టి.రామారావు ప్రభుత్వానికి కొత్త జీవం అందింది. అయినా ఆయన ప్రభుత్వం ఏ గుణపాఠాలూ నేర్చుకోక పోగా పాత పద్ధతులనే కొనసాగిస్తూ వచ్చింది.

నిజానికి తెలుగుదేశం ప్రభుత్వం స్థిరంగా ఉండగలిగి ఉంటే, ఈ లోపాలను పరిహరించుకోగలిగి ఉంటే రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఆ ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకుని ఉండేవారే. ఎందుకంటే ప్రాంతీయ పార్టీగా, జనాకర్షక పథకాలు కొన్నిటినైనా అమలుచేసిన పార్టీగా, తెలుగు జాతి ఆత్మాభిమానం వంటి ఆకర్షణీయ నినాదాలు ముందుకు తెచ్చిన పార్టీగా తెలుగుదేశం పార్టీ జనాసక్తికరంగానే ప్రవర్తించింది. ఢిల్లీ గద్దెమీదినుంచి రాష్ట్రాల మీద సాగిన కర్రపెత్తనాన్ని నిరసించి, కేంద్రానికి రాష్ట్రానికీ మధ్య ప్రజాస్వామిక సంబంధాన్ని కోరి ప్రశంసనీయంగా ప్రవర్తించింది.

అయితే ఈ అభివృద్ధికర దృక్పథమూ, ప్రజాస్వామిక దృక్పథమూ పార్టీ అగ్రనాయకుడిలో గాని, పార్టీలో గాని, ప్రభుత్వంలో గాని ఎన్నడూ ఆచరణలోకి రాలేదు.

అగ్రనాయకుడుగా ఎన్.టి. రామారావు గత కాంగ్రెస్ ప్రభుత్వాలలో కొనసాగినంత ప్రజాస్వామిక చర్చాసాంప్రదాయాన్ని కూడా రద్దు చేసివేసారు. 'నేనే ప్రజ' అని బహిరంగంగానే ప్రకటించి ఆయన ప్రజాభిప్రాయాన్ని వేరే వినవనవసరం లేదని చెప్పకనే చెప్పారు. పార్టీలో మరో నాయకుడు ఆవిర్భవించడానికి వీలులేని, ప్రభుత్వంలో మరో మంత్రికి ప్రాచుర్యం రావడానికి వీలులేని ఏక వ్యక్తి నిర్ణయాధికారాన్ని ఆయన కొనసాగించారు.

పార్టీ స్థాయిలో కూడా పార్టీ కార్యాలయాలు, పోలిట్‌బ్యూరో, కార్యవర్గ సభ్యులు, శిక్షణాలయాలు, వంటి వ్యవస్థ అంతా సవ్యంగానే ఉన్నప్పటికీ అగ్రనాయకుడు చెప్పింది వినడమే తప్ప మాట్లాడే స్వేచ్ఛలేని స్థితి నెలకొల్పారు. అలా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి తావులేకుండా పోయింది. పార్టీ మహాసభలు అగ్రనాయకుడి పుట్టిన రోజున జరగడం, అగ్రనాయకుడి పాదాభివందనం సాంప్రదాయాన్ని ఇష్టంగా కొనసాగించడం, సీనియర్ మంత్రులతో కూడా బహిరంగంగా 'డోంటాక్' అన్న దురుసుతనంతో అగ్రనాయకుడు ప్రవర్తించడం వంటి చర్యలన్నీ తెలుగుదేశం పార్టీకి ఒక ప్రజాస్వామిక సాంప్రదాయంలోని పార్టీగా గుర్తింపును ఇవ్వలేకపోయాయి.

సీనియర్ మంత్రి ఒకరు తొలిరోజుల్లోనే ద్రోహం చేయడంతో ప్రభుత్వ స్థాయిలో కూడా ఎన్.టి. రామారావు ఎవరినీ నమ్మలేక పోవడం అలవాటు చేసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన నిర్ణయాలు చాలా సందర్భాలలో మంత్రివర్గ సహచరులకు, అధికారులకు తెలియకుండానే ఏ పదవీ లేని కుటుంబీకులకు తెలియడం వారి ప్రమేయం సాగడం మొదలయింది. కాంగ్రెస్ పాలనలో రాజ్యాంగేతర అధికార కేంద్రాలు ఏర్పడడం గురించి ఏ విమర్శలు తలెత్తాయో అవే విమర్శలు తలెత్తడానికి భూమికను తెలుగుదేశం పార్టీ కల్పించింది.

వ్యక్తిగత స్థాయిలోనూ, పార్టీ స్థాయిలోనూ, ప్రభుత్వ స్థాయిలోనూ ఇటువంటి స్థితి కొనసాగుతున్నప్పుడు రాజకీయ ప్రత్యర్థుల పట్ల, ప్రజల మౌలిక హక్కుల పట్ల ప్రభుత్వానికి చిన్నచూపు ఉండడం సహజమే.

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలపై పోలీసు అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం మీది చీటికీ మాటికీ మండిపడే ఎన్.టి. రామారావు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక ప్రజా వ్యతిరేక: నల్ల చట్టాలను యధాతథంగా కొనసాగించారు. టెర్రరిస్టు అండ్ డిస్రప్టివ్ ఆక్టివిటీస్ (ప్రివెన్షన్) ఆక్ట్‌ను రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పుడు లోక్‌సభలో తెలుగుదేశం సభ్యులు దాన్ని తీవ్రాతి తీవ్రంగా ఖండించారు. రాజకీయ ప్రత్యర్థుల మీద ఈ నల్ల చట్టాన్ని దాడి దుర్వినియోగం చేయగూడదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కాని, ఆ చట్టాన్ని పంజాబ్ తర్వాత అతి ఎక్కువగా వాడినది తెలుగుదేశం పాలనలోని ఆంధ్రప్రదేశ్! పైగా కేవలం రాజకీయ ప్రత్యర్థులపైనే కాక అమయక ప్రజలపై, గిరిజనులపై కూడా ఆ చట్టాన్ని వాడడం జరిగింది.

తెలుగుదేశం పాలనలో లాకప్ మరణాల సంఖ్య, ఎన్‌కౌంటర్ మరణాల సంఖ్య అంత వరకూ ఉన్న రికార్డులను అధిగమించి

పునరుక్తి

పోయాయి. పోలీసు యాంత్రాంగానికి ఏ చర్య అయినా చేయడానికి లైసెన్సు దొరికిన స్థితి ఏర్పడింది. రాష్ట్రంలో చాలా జిల్లాలలో ప్రజాస్వామికంగా చట్టబద్ధంగా సభలూ, సమావేశాలూ ఏర్పాటుచేసుకునే అవకాశాలు నిరాకరించబడ్డాయి.

ఈవిధంగా ఎన్.టి. రామారావు పాలన ఎంత ఆశాజనకంగా, ఎంత ఆర్భాటంగా ఉనికిలోకి వచ్చిందో అంత నిరాశను ప్రేరేపించింది. అంత గందరగోళాన్ని సృష్టించింది. వేకువ వెలుగనుకున్నదల్లా వేడిగాడ్పుల మండుటెండ అయిపోయింది. కాంగ్రెస్ పాలనను దశాబ్దాల పాటు చూసి విసిగిపోయినప్పటికీ ఈ మం[illegible]ండకన్నా [illegible]క్కని చీకటే నయమేమోనని ప్రజలు అభి[illegible]డ్డారంటే ఆశ్చర్యం లేదు. ఎందుకంటే ప్రజల ముందు ఈ [illegible]దారు [illegible] మరోసారి ఉందేమోననే ఆశ ఇంకా ఏర్పడలేదు. ఏర్పడిన ఆశలయినా ఇంకా బలం పుంజుకోలేదు.

(ఆంధ్రజ్యోతి 5-12-89)

లేఖా వీక్షణం

"వీక్షణం" మొదటి రెండు సంచికలు బాగున్నవి. ఒక చక్కటి స్వరూపం పత్రికకు కల్గుతున్నది. అభివందనలు.

ఒకటి రెండు అభిప్రాయాలు, సలహాలు

అక్టోబర్ 1-15, 2003 సంపాదకీయంలో హింసను ప్రతికూలిస్తూ ఒక మాట చెప్పవలసింది. హింస ఎవరి నుండి వచ్చినా ప్రతికూలించడం మీపట్ల కర్తవ్యం అని అనుకుంటాను. మీ విశ్లేషణ బాగున్నది. దాని గురించి మరో అభిప్రాయం లేదు.

రెండు, మీ సలహా మండలిలో మహిళలకు చోటు లేదా? అది కొంచెం ఎబ్బెట్టుగానే ఉంది. కొంతకాలం క్రితం మహిళల సమస్యల గురించి ఒక ఘాటైన సంపాదకీయం రాశారు. కాని పక్కనే ఉన్న గొప్ప పేర్లలో ఒక్కరు కూడా స్త్రీ కాకపోవడం బొత్తిగా నచ్చలేదు.

మూడు, ఈ 1-15 అక్టోబర్ సంచికలో ముఖ్యంగా బాలగోపాల్, రామచంద్రయ్యగార్ల వ్యాసాలు చాలా బాగున్నవి. మీ వ్యాసం (అసెంబ్లీ పోకడ మీద) కనువిప్పు చేసేదిగా ఉన్నది. మీ సంపాదకీయంలో విశ్లేషణ చక్కగా ఉన్నది.

నాల్గు, ఒకరు వెనుక మీకు వ్రాసినట్లు వీక్షణం తెలుగులో ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలాంటి పత్రిక అయ్యే సూచలు అన్నీ ఉన్నవి. కాని అడ్వర్టైజ్‌మెంట్లు లేవు. రూ.5/-తో మీరు ఎంతకాలం నడిపించగలరు? విపణి గురించి ఆలోచించకపోతే పత్రిక మనుగడ కష్టం. అలాంటి అవాంతరం జరిగితే అది ఎంతైనా శోచనీయం అవుతుంది.

- ఎం.వి. శాస్త్రి,
తార్నాక, సికింద్రాబాద్

వీక్షణం చందాదారులు కాగోరువారు 'సమతా పబ్లికేషన్స్' పేర రూ. 120/-లను డి.డి.గా కింది అడ్రసుకు పంపించగలరు.

వి.హనుమంతరావు, ఇం.నెం. 8-3-898/22, రోడ్ నెం. 3, నాగార్జుననగర్, హైదరాబాద్ - 500 073.

Owned, Printed and Published by V.Hanumantha Rao at D.No. 8-3-898/22, Road No. 3, Nagarjuna Nagar, Hyderabad-500 073.
Designed & Printed at: Nutan Art Printers. Lakdi-ka-pool. Hyderabad. Editor : V.Hanumantha Rao